
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY



నల్లగొండ
5
శుక్రవారం 24 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	48,778	48,778
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	1976.02	1420.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.309 (43.548)	13,110	37,847

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

4,905

మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు



- వచ్చిన ఆదాయం 147.15కోట్లు
- గతం కంటే స్వల్పంగా పెరిగిన ఆదాయం
- దర్వేశిపురంలో అత్యధికంగా 154 దరఖాస్తులు
- 27న లక్ష్మీగార్డెన్స్‌లో దుకాణాలకు లక్కీడ్రా

మద్యం దుకాణాలకు జిల్లావ్యాప్తంగా 4,905 దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ సంవత్సరం-2025-27కు సంబంధించి జిల్లాలో ఏ-4 కేటగిరీ 154 మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని రామగిరి వద్ద ఉన్న జిల్లా ఎక్సైజ్‌కార్యాలయం, మిర్యాలగూడ రోడ్డు లోని ఎక్సైజ్‌స్టేషన్ వద్ద దరఖాస్తులను స్వీకరించారు.
(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

వాస్తవానికి గత శనివారమే గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం 23వ తేదీవరకు గడువు పొడిగించడంతో గురువారం సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించారు. శనివారం అర్ధరాత్రి వరకు 4610 దరఖాస్తులు రాగా, ఈ నాలుగురోజుల్లో అదనంగా 295 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 4,905 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి బి.సంతోష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 154 దుకాణాల్లో ఎస్టీలకు 4, ఎస్సీలకు 14, గౌడ సామాజికవర్గానికి 34 షాపులు కేటాయించగా అన్నింటికీ దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా జనరల్ దుకాణాలకు, మండలాల్లో ఒక్కో దుకాణం ఉన్న చోట, పట్టణాల్లో, జాతరలు, ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, హైవే, పరిశ్రమలున్న ప్రాంతాల్లోని దుకాణాలకు ఎక్కువ దరఖాస్తులొస్తాయని భావించినట్లే వచ్చాయి. ఈ దరఖాస్తులన్నింటినీ కలిపి దుకాణాల వారీగా కలెక్టర్ సమక్షంలో ఈ నెల 27వ తేదీన జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో లక్కీడ్రా నిర్వహించి లైసెన్స్‌దారులను ఎంపికచేస్తారు. ఎంపికైన లైసెన్స్ దారులకు 1, డిసెంబరు 2025 నుం చి 30 నవంబరు 2027 వరకు ఆయా దుకాణాల్లో వ్యాపారం నిర్వహించుకునేందుకు అనుమతిస్తారు.

దర్వేశిపురం దుకాణానికి 154 దరఖాస్తులు

నల్లగొండ డివిజన్ పరిధిలోని దర్వేశిపురం మద్యం దుకాణానికి జిల్లాలో అత్యధికంగా 154 దరఖాస్తులొచ్చాయి. ఆ తర్వాత వెలిమనేడు దుకాణానికి 82, కంచనపల్లికి 74 దరఖాస్తులు వచ్చాయి. చండూరు, నందికొండల్లోని దుకాణాలకు అత్యల్పంగా 18 చొప్పున దరఖాస్తులు రాగా, తిరుమలగిరి, నాంపల్లి, మర్రిగూడ, నందికొండ, నకిరేకల్ దుకాణాలకు 19 చొప్పున, నకిరేకల్, చండూరు, మునుగోడు లోని మూడు దుకాణాలు, హాలియా దుకాణాలకు 20 చొప్పున, పీఏపల్లి, నకిరేకల్, త్రిపురారం, మర్రిగూడ, నాంపల్లిలలోని దుకాణాలకు 21 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ప్రతీ దుకాణానికి 15 కంటే తక్కువ వస్తే, అక్కడ సిండికేట్ అయినట్లు భావించి రీటెండర్లు పిలిచే అవకాశముంది. అయితే నల్లగొండ జిల్లాలో అన్ని దుకాణాలకు 18కి మించి దరఖాస్తులు రావడంతో రీ టెండర్ల అవసరం లేదని చెబుతున్నారు. అన్ని దుకాణాలకు పోటాపోటీగానే దరఖాస్తులురావడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా	దరఖాస్తులు	ఆదాయం
యాదాద్రి	2776	రూ.83.28కోట్లు
నల్లగొండ	4905	రూ.147.15కోట్లు
సూర్యాపేట	2758	రూ.82.74కోట్లు
మొత్తం	10,452	రూ.313.56కోట్లు

ఈనెల 27న లక్ష్మీగార్డెన్స్‌లో లక్కీడిప్

ఈ దరఖాస్తుల ద్వారా దుకాణాల వారీగా నిర్వాహకులను ఈ నెల 27న లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో ఈ లక్కీడ్రా కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

దుకాణాల వారీగా వచ్చిన దరఖాస్తుల నెంబర్లతో లక్కీడిప్ నిర్వహిస్తారు. ఇలా ఎంపికైన వారందరికీ వచ్చే డిసెంబర్ నుంచి రెండేళ్లపాటు ఆయా మద్యం దుకాణాల వ్యాపారం నిర్వహించుకునేందుకు అనుమతిస్తారు.

గతం కంటే పెరిగిన ఆదాయం



జిల్లాలో తాజాగా జరిగిన మద్యం టెండర్లలో ఎక్సైజ్‌శాఖకు దరఖాస్తుల ద్వారా వచ్చే ఆదాయం గతం కంటే పెరిగింది. వాస్తవానికి దరఖాస్తులు తగ్గినా, దరఖాస్తు రుసుము (నాన్ రీఫండబుల్) విలువ గతంలో రూ.2లక్షలుంటే, ఈసారి అది రూ.3లక్షలకు పెంచడంవల్ల దరఖాస్తులు తగ్గినా స్వల్పంగా ఆదాయం పెరుగుదల నమోదైంది. 2023-25 టెండర్లలో మొత్తం 155 దుకాణాలకు గాను 7,057 దరఖాస్తులు రాగా, రూ.141.114 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలో సమకూరడం అప్పట్లో రికార్డుగా పేర్కొంటే, ఈసారి దరఖాస్తు రుసుము పెరిగిన నేపథ్యంలో అంతకుమించి ఆదాయం నమోదవడంతో ఎక్సైజ్ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా 4905 దరఖాస్తులు రాగా, రూ.147.15 కోట్ల ఆదాయం సమకూరింది.

'మన ఊరు- మన బడి' పనులు చేసి..

అప్పులపాలయ్యాం

- ఆదుకోరూ..: ఎస్ఎంసీ చైర్మన్ల ఆవేదన
- జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్లు పెండింగ్



డిండి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసిన పాఠశాల భవనం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన ఊరు - మన బడి పథకంలో చేపట్టిన పనులకు జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు చేసిన తాము అప్పులపాలయ్యామని ఎస్ఎంసీ చైర్మన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
(ఆంధ్రజ్యోతి-డిండి)

డిండి మండలంలో 2022-23లో మన ఊరు, మనబడి పథకంలో భాగంగా 17 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. పాఠశాల నిర్మాణ వ్యయం రూ.30లక్షలకు పైగా ఉన్న చెర్కుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, డిండి, తవక్లాపూర్ ఉన్నత పాఠశాలతోపాటు డిండి, తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాలలకు టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న కంట్రాక్టర్లు పనులు చేపట్టారు. మిగిలిన 12 పాఠశాలల పనులను ఎస్ఎంసీ చైర్మన్‌లు చేశారు. ఆర్థిక స్థోమతలేని ఎస్ఎంసీ చైర్మన్‌లు కొందరు ఇతరులకు పనులు అప్పగించారు. 17 పాఠశాలల పనుల్లో 10 పూర్తికాగా మరో ఏడు పాఠశాలల పనులు కొంతమేర అసంపూర్తిగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో ఎంపిక చేసిన పాఠశాలలకు మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్ నిర్మాణం వంటి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మన ఊరు, మన బడిలో ఎంపిక చేసిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వంట గది, ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మండలంలో ఎంపిక చేసిన 17 పాఠశాలల్లో చేపట్టిన పనులకు రూ.4కోట్లు చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో.. మిగతా 8వ పేజీలో..

నేరాల అదుపునకు

ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, వాటిని అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా పోలీస్‌శాఖ పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగాలన్నారు. పెరిగిపోతున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పనిచేయాలన్నారు. నిఘా వ్యవస్థకు దోహదపడుతున్న సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. నేరం చేసే వారికి శిక్ష పడాలని, నేరం చేయని వారికి రక్షణగా ఉండాలని ఆయన సూచించారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యంతో పాటు ఇసుక అక్రమ రవాణా వంటి వాటిపై దృష్టి సారించాలని ఎస్పీ అన్నారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా సమావేశాల్లో అదనపుఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాఘవరావు, రాము, మహాలక్ష్మయ్య, కరుణాకర్, రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు సంతోష్, శ్రీను పాల్గొన్నారు.

పత్తి రైతుకు

తేమ తంటా



- అడపాదడపా కురుస్తున్న వానలతో రంగు మారుతున్న పత్తి
- నేటి నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు
- క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.8,110

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతును తేమ తంటా వేధిస్తోంది. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలు పత్తి రైతును కుంగదీస్తున్నాయి. వానలతో పత్తి రంగు మారుతోంది. ఖరీఫ్‌లో 5.68 లక్షల పత్తి సాగు చేశారు. అయితే ఈ ఏడాది తెగుళ్ల బెడదతో పాటు వివిధ కారణాలతో పత్తి 50శాతం మేరకే దిగుబడి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉంటే ప్రతీ ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుతం 5 నుంచి 6 క్వింటాళ్లు వస్తుందా? రాదా? అనేది రైతులను వెంటాడుతోంది. అధికారులు మాత్రం జిల్లాలో 57,23,951 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే అందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వ్యవసాయ, మార్కెటింగ్ అధికారుల లెక్కల ప్రకారం ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినా ఆ తర్వాత వాతావరణ మార్పులతో రైతుల ఆశలు సన్నగిల్లాయి. అత్యధికంగా ఎర్ర తెగులు మూలంగా దిగుబడులపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది.

నాణ్యత ఉంటేనే క్వింటాకు రూ.8,110 చెల్లింపు

పత్తి కొనుగోళ్లను సీసీఐ శుక్రవారం నుంచి ప్రారంభించడానికి సన్నద్ధమవుతుంది. జిల్లాలోని 23 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేపట్టనున్నారు. అయితే ఒకటి రెండు జిన్నింగ్ మిల్లుల్లో సాంకేతిక సమస్యల వల్ల రెండు రోజులు ఆలస్యంగా కొనుగోలు జరుగుతాయని సమాచారం. నాణ్యత ఉంటేనే క్వింటాకు రూ.8,110 చెల్లిస్తారు. తేమ సమస్య ఎదురైతే మాత్రం కొనుగోళ్లు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. నాణ్యత విషయాన్ని అధికారులు మూడు రకాలుగా పరిశీలిస్తున్నారు. పింజ రకం బట్టి నాణ్యత ఉంటే క్వింటాకు రూ.8,110, ఆ తర్వాత నాణ్యతను బట్టి రూ.8,060, మూడో రకానికి సంబంధించి క్వింటాకు రూ.8010 చెల్లిస్తారు. మొదటి రకంలో పింజ పొడుగు 29.5 మి.మీల నుంచి 30.5 మి.మీలు చూస్తారు. రెండో రకంలో పింజ పొడవును 29.01 నుంచి 29.49 మి.మీలు, మూడో రకం మిగతా 8వ పేజీలో..





ఆదివాసీ సంప్రదాయ దుస్తుల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాధవి దంపతులు

గిరిజనులు కాదు..

ఎమ్మెల్యే దంపతులు

- వినూత్నంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం
- అరకులో ఆదివాసీ సంప్రదాయ రీతిలో వేడుక

6

కోతల వేళ.. ఆశలు ఆవిరి

- రైతు వెన్ను విరిచిన గాలివాన
- వర్షాలతో అన్నదాత ఇక్కట్లు
- వరికోత, పత్తితీత ఎలా?



గాలివానతో నేలకొరిగిన వరిచేలు

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

గాలివానతో రైతుల వెన్ను విరిగింది. కోతకు వచ్చిన పంట నేలకు ఒరిగి రైతుల కంటతడి పెట్టిస్తున్నాయి. బుధవారం వానతో పాటు బలమైన గాలులు వీచాయి. దీంతో ఆయకట్టులో అనేక చోట్ల ఇప్పుడిప్పుడే ఈత వేస్తున్న వరి మొదలు నేడో రేపో కోత కోసే వరి పంట కూడా నేలకరుచుకపోవడంతో చేతికొచ్చిన పంట నేలపాలైందని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు.

వరి ఎన్నులు నీటిలో నాని వరిగింజలు మొలకలు వచ్చి పనికి రాకుండా పోయే అవకాశం ఉందని వాపోతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేయగా పంట చేతికి వచ్చే సమయంలో వర్షం పడి పంటలను అతలాకుతలం చేసిందని పలువురు రైతులు వాపోతున్నారు. పత్తి తీత పనులు ముమ్మరంగా సాగుతుండగా వర్షం కురవడంతో పత్తి తడిచి నల్లగా మారుతోందని వాపోతున్నారు. వీటివల్ల పూర్తిగా దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతామని కర్షకులు కంటనీరు పెడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిసి తల్లడిల్లుతున్నారు.

నాడు పంటలకు జీవం

వానాకాలం ప్రారంభంలో వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయన్న ఆశాభావంతో సాగుకు సిద్ధమైన రైతులకు భంగం కలిగింది. ఆగస్టు నెల వరకు సగటు వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో మెట్ట పంటలు మొలకెత్తక పోగా మొలిచిన పత్తి మొక్కలు వాడుపడింది. ఆగస్టు నెలలో అడపాదడపా కురిసిన వర్షాలకు మెలకలకు జీవం పోయడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు సాగర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండి ఉరకలెత్తడంతో సాగర్ ఎడమకాల్వ కింద ఆయకట్టుకు ఆగస్టులో నీరు విడుదల చేయడంతో చకచకా వరి నాట్లు పూర్తి చేశారు. మొత్తంగా నల్లగొండ జిల్లాలో 5.76 లక్షల ఎకరాల్లో పత్తి మిగతా 8వ పేజీలో..

పాఠశాలకు స్థలాన్ని నిర్ధారించండి



జప్తివీరప్పగూడెం వద్ద ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ స్థలానికి హద్దులు నిర్ధారించి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ మండల పరిధిలోని జప్తివీరప్పగూడెం వద్ద 214 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణం చేపట్టేందుకు 25 ఎకరాల స్థలం అవసరమవుతుందని, ఆ స్థలానికి హద్దులు నిర్ధారించి మ్యాప్‌తో సహా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పాఠశాల భవన నిర్మాణంలో భాగంగా తరగతి గదులు, హాస్టల్, డార్మెటరీ, లైబ్రరీ, ల్యాబ్‌లు, ఆట స్థలం, ఆడిటోరియాలను అధునాతన సౌకర్యాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్, మిర్యాలగూడ తహసీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.

అధైర్యపడకు.. అండగా ఉంటా : కలెక్టర్



నిత్యకు రూ.5లక్షల చెక్కును అందిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, పక్కన సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

వేములపల్లి, మాడ్గులపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తనకు ఎవరూ లేరని అధైర్య పడకుండా మనోధైర్యంతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి చిన్నారి పున్నా నిత్యకు మనోధైర్యాన్ని కల్పించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. మాడ్గులపల్లి మండలంలోని ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన పున్నా నిత్య తండ్రి సాంబయ్య, సోదరుడు శివమణి గణేష్ నిమజ్జనం సందర్భంగా మృత్యువాతపడ్డారు. అప్పటికే చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన నిత్య తండ్రి, సోదరుడు శివమణి మృతి చెందడంతో ఒంటరి అయింది. గ్రామస్థులు, బంధువులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు కలెక్టర్‌కు నివేదించారు. స్పందించిన కలెక్టర్ నిత్యకు రూ.5లక్షల చెక్కును వేములపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం ఉన్నా స్థానిక సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని, అండగా ఉంటామని సూచించారు. చెక్కును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీతో తన చదువుకు, భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్లు హేమలత, సరోజపావని, డీటీలు కోటేశ్వరి, సైదులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

క్రీడా జట్ల ఎంపిక పోటీలు



బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఉపేందర్

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అండర్- 14,17 బాలబాలికల బాస్కెట్‌బాల్, బీచ్ వాలీబాల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సముద్రాల ఉపేందర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన ఎంపిక పోటీల్లో బాల, బాలికలు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. అత్యంత ప్రతిభ కనబరిచి గెలుపొందిన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ జట్టుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, వీసం, రాజు, అశ్రఫ్, జంగయ్య పాల్గొన్నారు. అదేవిధంగా మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన చెస్ క్రీడా పోటీలను డీవైఎస్‌వో అక్బర్‌అలీ ప్రారంభించారు. అండర్-14, 17 బాలబాలికలు పాల్గొని పోటీ పడ్డారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కుంభం నర్సిరెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, గఫార్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

- రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి



నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లిలో కాటన్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న గోపి, కలెక్టర్ ఇలాత్రిపాఠి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

7

మెసెంజర్ల నియామకమెప్పుడో

మెసెంజర్లు లేక కార్యాలయాలు శుభ్రం చేసుకుంటున్న సిబ్బంది



నూతనకల్ మండలకేంద్రంలోని ఎంఆర్‌సీ భవనం

నూతనకల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రాల్లోని ఎంఆర్‌సీ భవనాలు శుభ్రం చేసే మెసెంజర్లు లేక సిబ్బందే శుభ్రం చేసుకుంటున్నారు. సూర్యాపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లాలో నూతనంగా మద్దిరాల, నాగారం, చింతలపాలెం, పాలకీడు, అనంతగిరి ఐదు మండలాలు ఏర్పడ్డాయి. ప్రతి మండలంలో ఎంఆర్‌సీలు ఏర్పాటు చేసినా పాత మండలాల ఎంఈవోలే ఇన్‌చార్జిలుగా అక్కడి నుంచే విధులు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త మండలాలకు నూతన ఎంఈవోలను నియమించడంతో అక్కడ ఎంఆర్‌సీల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారు. కొత్త మండలాలకు సిబ్బందిని నియమించకుండా పాత మండలంలో పనిచేస్తున్న ఎల్‌డీఏలతో ఆన్‌లైన్ పనులు చేయిస్తున్నారు. కార్యాలయాలను శుభ్రం చేసే మెసెంజర్లను నియమించక పోవడంతో సిబ్బందే శుభ్రం చేసుకుంటున్నారు. నూతనకల్, నేరేడుచర్ల, తిరుమలగిరి, చిలుకూరు మండలాలల్లో కార్యాలయాలు మెసెంజర్లు లేకపోవడంతో అందులో పనిచేసే సిబ్బందే కార్యాలయాలు శుభ్రం చేస్తున్నారు. వీరంతా సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో డీపీవోలు 5, డీఈవోపీలు 5, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 8, ఐఈఆర్పీలు 15, సీఆర్పీలు 4 ఖాళీలు ఉన్నాయి.

జిల్లా అధికారులకు తెలియజేశాం

నూతనకల్‌లో నిర్వహించే మెసెంజర్ పదవి విరమణ చేసిన విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్ భవిత కేంద్రంతో పాటు, కార్యాలయాన్ని శుభ్రం చేస్తుంది.

• ఎంఈవో, రాములునాయక్

వ్యాధులు.. క్యూ కడుతున్న రోగులు

• వాతావరణంలో మార్పుతో సీజనల్ వ్యాధులు • దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి పెరుగుతున్న రోగులు • సరిపడా బెడ్లులేక ఇబ్బందులు

వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తత అవసరం. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముంది. పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులు దరి చేరకుండా జాగ్రతలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వరుసగా వర్షాలు కురుస్తుండడం, వాతావరణంలో మార్పు రావడమే కారణమని వైద్యులు చెబుతున్నారు.

• ఆంధ్రజ్యోతి, దేవరకొండ



దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు

వ్యాధులు ప్రబలుతుండడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రతి రోజూ 700 నుంచి 800 వరకు ఓపీ పేషంట్లు వస్తున్నారు. జ్వరం, జలుబు, కీళ్ల నొప్పులతో అవస్థ పడుతున్నారు. దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి సాధారణ రోజుల్లో 500 నుంచి 650 వరకు రోగులు వచ్చేవారు. దేవరకొండ డివిజన్‌తోపాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మర్రిగూడ, నాంపల్లి, ఇతర ప్రాంతాల నుంచి కూడా రోగులు వస్తుండడంతో వంద పడకల ఆసుపత్రి కిక్కిరిస్తోంది. రోగుల సంఖ్య పెరుగుతుండడం, బెడ్లు సరిపడక పోవడంతో ఇబ్బందులుపడే పరిస్థితి ఉందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

బెడ్ల సంఖ్య పెరిగితే..

ఆసుపత్రిలో రోగులకు సరిపడ మందులు, ఇంజక్షన్‌లు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. సరిపోను బెడ్లు లేవు. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేసి బెడ్లసంఖ్య పెంచాలని స్థానికులు కోరుతున్నారు. 200 పడకల ఆసుపత్రి మంజూరైనప్పటికీ స్థల పరిశీలనలో ఉంది. 200 పడకల ఆసుపత్రి ఏర్పాటైతే అన్ని సౌకర్యాలు ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు.

అందుబాటులో ఆక్సిజన్ ప్లాంట్

ప్రస్తుతం ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో పాటు 30 మంది డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఐసీయూ గదులను సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఐదు డయాలసిస్ బెడ్లు ఉన్నాయి. మరో ఐదు డయాలసిస్ బెడ్లు కూడా మంజూరయ్యాయి. వీటిని ఎమ్మెల్యే బాలునాయక్ త్వరలో ప్రారంభించనున్నారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉంది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డాక్టర్‌లు, సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీసీహెచ్ డాక్టర్ మాతృనాయక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

సరిపడా బెడ్లు ఏర్పాటు చేయాలి



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా బెడ్లు లేకపోవడంలో ఇబ్బందులు పడుతున్నాం. ఆసుపత్రికి వెళితే బెడ్లులేకపోవడంతో వైద్య పరీక్షలు చేయించుకొని విధిలేని పరిస్థితిలో ఇంటికి చేరుకునే పరిస్థితి. కొంతమంది బెడ్లు లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలి.

వస్కుల సుధాకర్, దేవరకొండ

రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం



వాతావరణంలో మార్పులు, వరుసగా వర్షాలు కురుస్తుండడంతో ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరిగింది. రోజుకు 800కుపైగా ఓపీ పేషంట్‌లు జ్వరం, దగ్గు, జలుబు సమస్యలతో వస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. 200 పడకలుగా ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులకు చెప్పాం.

• డాక్టర్ రవిప్రకాష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం నుంచి దేవరకొండ మీదుగా వాహనంలో తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గురువారం దేవరకొండ సీఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా చింతపల్లి మండలం నసర్లపల్లి నుంచి 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తికి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దేవరకొండ శివారులో పోలీసులు పట్టుకున్నారు. బొలేరో వాహనంతోపాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులు మరియాబి, సంపతయ్య, శివలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చికుక్కల దాడిలో యువకుడికి గాయాలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): పిచ్చి కుక్కల దాడిలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రావుల నవీన్ అనే యువకుడు తన ఇంటి వద్ద కూర్చుని ఉండగా అక్కడకు వచ్చిన రెండు పిచ్చికుక్కలు అకస్మాత్తుగా నవీన్‌పై దాడిచేసి నోటి వద్ద తీవ్రంగా గాయపరిచాయి. దీంతో నవీన్‌ను నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

వలిగొండ: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నెపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి శ్రీశైలం ద్విచక్రవాహనంపై సంగెం గ్రామానికి వెళుతుండగా గ్రామ మధ్యలో కుక్కలు అడ్డురావడం వల్ల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్సనిమిత్తం 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

సూర్యాపేటరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు చేశారు. మహిళ, విటుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని జనగాం క్రాస్ రోడ్డులో గల ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు రూరల్ పోలీసులు బుధవారం ఇంటిపై దాడులు నిర్వహించారు. మహిళ, విటుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిం చినట్లు రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మునగాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని నరసింహులగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నడిగూడెం మండలం బృందావనపురానికి చెందిన కొందరు పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.13500 నగదు. ఆరు బైక్‌లు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మండలి చైర్మన్ గుత్తాకు స్వాగతం

చిట్యాలరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దంపతులకు నల్లగొండ చిట్యాల మండలానికి చెందిన నాయకులు శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, వనమా వెంకటేశ్వర్లు, తేరటుపల్లి హనుమంతు, పాటి మాధవరెడ్డి, చెరుకు సైదులు, లింగయ్య ఉన్నారు.

పరువుపోతుందని హత్య చేశారు

• వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ • వివాహేతర సంబంధం నెరుపుతుందనే హత్య • ఐదుగురి అరెస్ట్, పరారీలో మరొకరు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటక్రైం, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో తమ పరువు పోతుందని భావించి మహిళను హత్య చేసిన నిందితులను సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదుగురిని అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్న కుమార్ గురువారం రాత్రి సూర్యాపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూరు గ్రామానికి చెందిన కొరివి మల్లయ్య-భిక్షవమ్మ దంపతులు గ్రామంలో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మల్లయ్య పెద్ద కుమారుడు భరత్‌కు వివాహమైంది. చిన్న కుమారుడు ప్రవీణ్‌కు వివాహం కాలేదు. భిక్షవమ్మ మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయమై పలుమార్లు కుటుంబ సభ్యులు భిక్షవమ్మను హెచ్చరించారు. గ్రామంలో, కుటుంబంలో పరువు పోతుందని, చిన్న కుమారుడు ప్రవీణ్‌కు వివాహం కావడం లేదని పలుమార్లు చెప్పారు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఎలాగైనా ఆమెను చంపాలని భర్త మల్లయ్య, హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా పనిచేసే మల్లయ్య, పెద్ద కుమారుడు కొరివి భరత్, హైదరాబాద్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేసే చిన్న కుమారుడు ప్రవీణ్, మల్లయ్య సమీప బంధువు హైదరాబాద్‌లో ఉంటూ చికెన్ సెంటర్ నడుపుతున్న కొరివి మహేష్, మల్లయ్య చిన్న కుమారుడు ప్రవీణ్ మిత్రులైన ఏపూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లుగా పనిచేసే పూసపల్లి జనార్దన్, పోకబత్తిని వంశీ కలిసి పథకం పన్నారు. ఈ నెల 21 గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ఉండడంతో భిక్షవమ్మ ఏపూరు గ్రామానికి వచ్చింది. పంచాయితీ అనంతరం తర్వాత తిరిగి వెళ్తుండగా ముందుగా అనుకున్న పథకం ప్రకారం గ్రామంలోనే జనార్దన్ బైక్‌పై వెళ్లి భిక్షవమ్మను అడ్డుకుని, మహేష్, వంశీలకు ఫోన్ చేశాడు. దీంతో వెంటనే వారు కారులో సంఘటనా స్థలం వద్దకు వచ్చి కారులో నుంచి దిగి వెంట తెచ్చుకున్న కత్తులతో భిక్షవమ్మను గొంతుకోసి, ఛాతిలో పొడిచి హత్య చేసి పరారయ్యారు. ఈ విషయమై ఆత్మకూర్(ఎస్) పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. హత్యలో పాల్గొన్న వారిని సాంకేతిక ఆధారాలతో గుర్తించారు. హత్యలో పాల్గొన్న మల్లయ్య, భరత్, ప్రవీణ్, జనార్దన్, వంశీ ఈ నెల 23న సూర్యాపేట పట్టణంలోని హైటెక్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి కారు, ఆటో, రెండు బైక్‌లు, హత్యకు ఉపయోగించిన కత్తులు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. మరో నిందితుడు కొరివి మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతనిని కూడా త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ గురుకుల రాజశేఖర్, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల ఎస్‌ఐలు శ్రీకాంత్, మహేశ్వర్, సిబ్బంది హమీద్, వెంకటేష్, విజయ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కారులో వచ్చి.. రైలుకు ఎదురు వెళ్లి



అభిలాష్(ఫైల్)

బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెం గ్రామానికి చెందిన వస్పరి వెంకటేశ్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అభిలాష్(19) ఉన్నారు. అభిలాష్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఔషాపూర్ శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన అభిలాష్ రాత్రి 10గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. అందరూ పడుకున్న తర్వాత కారులో ఇంటి నుంచి బయలు దేరి బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్ పక్కన సర్వీస్ రోడ్డుపై కారును పార్కు చేసి బీబీనగర్ - ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మార్గమధ్యలో మనుగూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని నేరుగా చూసిన రైలు లోకోపైలెట్ బీబీనగర్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. ఆయన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్‌పీ ఇన్‌చార్జి కృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అభిలాష్ మృతితో స్వగ్రామం భూదాన్‌పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..



సంద్యాల నర్సిరెడ్డి (ఫైల్)

చండూరు రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక క్రిమిసంహారక తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా, చండూరు మండలం, కస్తాల గ్రామ ఆవాసం మెండువారిగూడెం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ వెంకన్న, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సంద్యాల నర్సిరెడ్డి(48) గ్రామంలో తన కున్న నాలుగు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక బుధవారం రాత్రి ఊరికి దూరంగా బహిరంగ ప్రదేశంలో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 10గంటలు దాటినా నర్సిరెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. ఎంతకూ ఎత్తకపోవడంతో ఆందోళనకు గురైన స్థానికులతో కలిసి అర్ధరాత్రి వరకు వెతికారు. నర్సిరెడ్డి ఊరికి దూరంగా నిర్మానుష ప్రదేశంలో విగత జీవిగా పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నర్సిరెడ్డి కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

ముకుందాపురంలో విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

మునగాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ చిన్న సైదులు(50), అదే గ్రామంలో జట్టి శ్రీరాములు ఇంటి ప్రహరీ నిర్మించేందుకు కొందరు కూలీలతో కలిసి తాపీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో సైదులు పిల్లరు గుంతలో ఐరన్ పెట్టే క్రమంలో 11కేవీ విద్యుత్ లైన్ తీగలు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సైదులుకు ముగ్గురు కూతుర్లు, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యప్తు పోలీసులు తెలిపారు.

అండర్‌పాస్.. అయ్యేదెన్నడో

• కొనసాగుతున్న అండర్‌పాస్ బ్రిడ్జి పనులు

• పనుల్లో తీవ్ర జాప్యం • ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కొమరబండ వద్ద నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి

కోదాడ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కొమరబండ వై-జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూ.36 కోట్ల మంజూరు చేసి ఆరు నెలల క్రితం పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఓ నిర్మాణ సంస్థ పనుల్లో జాప్యం చేస్తుండడంతో వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హైద్రాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రూ.40 కోట్లతో ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. కొమరబండ వై-జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జికి కూడా ప్రభుత్వం రూ. 36కోట్లు మంజూరు చేసింది. ఈ రెండు ప్రాంతాలను జాతీయ రహదారి సంస్థ అధికారులు బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని నాలుగు లేన్ల రహదారిగా నిర్మిస్తున్న సమయంలోనే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ అధికారులు దానిని పట్టించుకోలేదు. దీంతో కోదాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి వాహనదారులు జాతీయ రహదారి దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వాహనాలు రోడ్డు దాటుతున్న వాహనాలు, ద్విచక్ర వాహనాలను ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాతపడ్డారు. మరికొంతమంది క్షతగాత్రులుగా మారారు. దీంతో ఈ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించిన సంస్థ పనులు వేగవంతం చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపులా సర్వీస్‌రోడ్లను ఏర్పాటు చేశారు. ఈ రోడ్లు కూడా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకుండానే వర్షాలకు కొట్టుకుపోయాయి. రోడ్లు మళ్లీ నిర్మించినా బ్రిడ్జి నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించలేదు. బ్రిడ్జి నిర్మాణ పనులను సంవత్సరంలో పూర్తిచేయాల్సి ఉండగా, ఇప్పటికే ఆరునెలలు దాటిపోయిందని వాహనదారులు, ప్రజలు పేర్కొంటున్నారు.

వాహనాల దారి మళ్లింపు

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం వల్ల కోదాడ పట్టణానికి వచ్చే వాహనాలకు కొమరబండ వై-జంక్షన్ వద్ద పనులు జరుగుతున్నందున హుజూర్‌నగర్ రోడ్డు మీదుగా ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. కోదాడ బస్టాండ్‌కు నిత్యం హైదరాబాద్, విజయవాడ వెళ్లేందుకు 500 బస్సులకు పైగా వచ్చి వెళ్తుంటాయి. ఈ బస్సులు కూడా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం వల్ల హుజూర్‌నగర్ రోడ్డు మీదుగా అయ్యప్పస్వామి గుడి పక్కన ఉన్న ఫ్లైఓవర్‌కు వైపు దారి మళ్లించారు. దీంతో హుజూర్‌నగర్ రోడ్డుకు వాహనాల రద్దీ పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లె వెలుగు బస్సులు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే బస్సులను సైతం హుజూర్‌నగర్ రోడ్డు మీదుగా దారి మళ్లించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు తెలిపారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



కొమరబండ వై-జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి పనులు పూర్తిచేసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి. నడిగూడెం, మునగాల మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోదాడ పట్టణానికి రావాలంటే అండర్‌పాస్ బ్రిడ్జి నుంచి రావాల్సి ఉంది. పనులు నత్తనడకన సాగడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసిన రోడ్డే వేస్తున్నారు తప్ప బ్రిడ్జి పనులు ముందుకు సాగడం లేదు. వెంటనే అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేసి వాహనదారులు, గ్రామీణ ప్రాంత ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

• ఎం. ముత్యాలు, కోదాడ

వినూత్నంగా ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం

అరకులో ఆదివాసీ సంప్రదాయ రీతిలో ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ దంపతులు



అరకులో ఆదివాసీ సంప్రదాయంలో వివాహ తంతు జరుపుకుంటున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాధవి దంపతులు

మిర్యాలగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించుకున్నారు. తమ 32వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన కుటుంబ సభ్యు లతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు లోయకు వెళ్లిన ఎమ్మెల్యే దంప తులు ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసి గూడెంలో గిరిజన సంప్రదాయ రీతిలో తమ పెళ్లిరోజు వేడుకను నిర్వహించుకున్నారు. అనుకోని అతిథిలుగా తమ గూడేనికి వచ్చిన ఎమ్మెల్యే దంపతులను గిరిజనులు తమ సంప్రదాయ బూరలు ఊది, భేరీలు మోగించి నృత్యాలు చేస్తూ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తమ ఆచారం, సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, ఆయన సతీమణి మాధవిని వరుడు, వధువుగా, ముస్తాబు చేసి పెళ్లితంతు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొందరు సంబంధిత వీడియోను గురువారం మిర్యాలగూడ వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఎమ్మెల్యే దంపతుల వెంట పెద్ద కుమారుడు సాయిప్రసన్న, కోడలు వెన్నెల ఉన్నారు. ఇటీవల తన కుమారుడి వివాహం అనంతరం రిసెప్షన్‌ను రద్దు చేసి సీఎం సహాయ నిధికి రూ.2కోట్లు విరాళం ఇచ్చి, రాష్ట్ర ప్రజల దృష్టిని ఆకర్షించిన ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ తన వివాహ వార్షికోత్సవాన్ని ఆదివాసీలతో కలిసి నిర్వహిం చుకుని మరోసారి వార్తల్లోకి ఎక్కారు.

రాష్ట్ర ప్రజలకు మేలు జరగాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



పూజల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత

యాదగిరిగుట్ట, భువనగిరి టౌన్ అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మేలు జరగాలనేది తన ఆకాంక్ష అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గురువారం సందర్శించారు. భువనగిరి, యాదగిరిగుట్టలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25 నుంచి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టబోయే జనం బాట కార్యక్రమం ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామన్నారు. సుమారు నాలుగు నెలలపాటు నిర్వహించే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. తిరుపతి తర్వాత యాదగిరిగుట్ట దేవాలయాలను దర్శించుకున్నామన్నారు. నిజామాబాద్ నుంచి చేపట్టబోయే జనం బాట కార్యక్రమం విజయవంతానికి ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా స్వామిని వేడుకున్నామన్నారు. ప్రతీ జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. భవిష్యత్తులో తాము అనుసరించే వైఖరిని ప్రజాబాటలో వెల్లడిస్తామన్నారు.

ఆలయ ప్రాశ్యస్త్యాన్ని కాపాడాలి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నేతృత్వంలో యాదగిరిగుట్ట ఆలయం అద్భుతంగా నిర్మితమైందని కవిత తెలిపారు. ఆలయ ప్రాశ్యస్త్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. తిరుపతిలో స్వామివారి హోర్డింగులు, చిత్రపటాలవలె కాకుండా విచిత్రమైన హోర్డింగులు ఇక్కడ వెలిశాయన్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై మళ్లీ వచ్చినప్పుడు వివరిస్తానన్నారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్‌రావు, ప్రచార కార్యదర్శి దుగుంట్ల నరేష్, కోల శ్రీనివాస్, బాలకృష్ణ, ఎత్తరి మారయ్య, రాంకోటీ ప్రజాపతి, గోపు సదానంద, యూనైటెడ్ పూలె ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బొల్ల శివశంకర్ పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

స్వామిని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దర్శించుకోగా గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయ మేరకు ఎమ్మెల్సీకి పూజారులు స్వాగతం పలికారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనంచేసి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు స్వామివారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు.

ధ్వంసమైన ఎయిర్ వాల్వ్‌కు మరమ్మతు



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు

ధ్వంసమైన ఎయిర్‌వాల్వ్

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కేంద్రం వద్ద గేల్‌వాల్వ్ ధ్వంసమైంది. దీంతో పైప్‌లైన్ లీకై నీరు మొత్తం జాతీయ రహదారిపై ప్రవ హించడంతోవాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఓ ప్రయాణికుడు వందకు డయల్ చేయడంతో సమాచారం తెలుసుకున్న హైదరాబాద్ మెట్రో బోర్డు అధికారులు వెంటనే నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టి నూతన ఎయిర్‌వాల్వ్ బిగించారు. నాగార్జునసాగర్ నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించి కోదండాపురం ప్లాంట్ ద్వారా హైదరాబాద్‌కు పెద్ద మొత్తంలో పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేశారు.

(ఆంధ్రజ్యోతి -కొండమల్లేపల్లి)

రైతులకు వాయుగండం

● వర్షాలతో అన్నదాత ఆగమాగం
● సాగర్ ఆయకట్టులో నేలవాలుతున్న పొలాలు
● గింజ దశలోనే పడి పోతున్న పంట

మిర్యాలగూడ, వ్యవసాయం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు అన్నదాత కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరి గింజ పాలుపోసుకుని చేతికొచ్చే దశలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరి పంటకు నష్టం వాటిల్లుతోంది. గాలి వానకు పంట నేల వాలి పోతుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. సాగర్ ఆయకట్టులో వరి చివరి దశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు 50 శాతంపైనే వరి నేలపై పడి పోయింది. దీంతో గింజ నాని పోయి మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతు న్నారు. కింద పడి పోయిన పొలాలను పైకి లేపి కట్టలు కట్టిస్తున్నారు. ఒక ఎకరానికి సుమారు 15మంది కూలీలు అవసరమవు తుంది. ఒక్కొక్కరికి రూ.4 వందల చొప్పున రూ.6వేల వరకు ఖర్చవు తుండడంతో రైతులకు భారంగా మారింది. మళ్లీ గాలితో కూ డిన వర్షం పడితే నిలబెట్టిన కర్రలు కింద పడిపోయి పూర్తిస్థాయిలో చేతికి రాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిసాగు చేసిన రైతులు కూలీల ఖర్చు భరించలేక పంటలను వదిలేసే పరిస్థితి నెలకొంది. వాయుగుండంతో వరుసగా వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ ప్రకటనతో పంట చేతికొచ్చేది కష్టమే అనే ఆందోళన అన్నదాతల్లో మొదలైంది.





సాగర్ ఆయకట్టు ప్రాంతంలో గాలి వర్షానికి ఒరిగిన వరి పొలం



కింద పడిన వరిని కట్టలు కడుతున్న కూలీలు

వర్షాలకు నేలకొరిగిన పంటలు

చింతలపాలెం : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో తుపాను ప్రభావంతో రెండు రోజుల నుంచి కురిసిన వర్షం కారణంగా పత్తి, మిర్చి, వరి పంటలు నేలకొరిగాయి. బలమైన గాలులతో కూడిన వర్షం వల్ల చేతికొచ్చిన పంట నేలమట్టమై పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా పత్తి పంట రంగు మారింది. అంతేకాక మొక్కలపై పగిలిన పత్తి తడవడంతో పత్తిలో ఉన్న గింజలు నాని మొలకలు రావడంతో రైతులను తీవ్రంగా నష్టపరిచింది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడటంతో వరి పంట ఏపుగా పెరిగింది. ఈ అకాల వర్షాల వల్ల వరి కూడా నేలకు వాలటంతో రైతులకు అపార నష్టం వాటిల్లిందని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి గింజలు మొలకలు వచ్చాయి



ఈ ఏడాది మూడు ఎకరాల పత్తి సాగు చేస్తున్నా. ఈ అకాల వర్షంతో పత్తి పూర్తిగా తడవడంతో పచ్చి రంగు మారింది. పత్తి గింజలు నాని మొలకలు ఎతా యి. దీంతో మార్కెట్ ధరలో ధర తగ్గే అవకాశం ఉంది. పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్లే అవకాశం లేదు.

-నరసింహారెడ్డి. చింతలపాలెం



వర్షాలకు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో దెబ్బతిన్న పత్తి పంట

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

● రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి
● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పత్తి మిల్లుల తనిఖీ



సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బాలెంలలో మంజీత్ కాటన్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న గోపి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నార్కట్‌పల్లి, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనల మేరకు నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రైతులు మద్దతు ధర పొందాలని పత్తి కొనుగోలు జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు బీ. గోపి సూచించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి వరలక్ష్మి కాటన్ మిల్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఏనుగులదోరి గ్రామానికి చెందిన పన్నాల యాదగిరి రెడ్డి అనే రైతు గోపితో మాట్లాడుతూ రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో పత్తిలో తేమశాతం బాగా ఉందని, రోజుల తరబడి ఆరబెట్టినా వాతావరణం దృష్ట్యా 12 శాతం తేమ వచ్చేలా లేదన్నారు. తేమ శాతాన్ని 15కు పెంచాలని కోరారు. దీంతో ఆయన స్పందించి తేమ శాతం పెంచడమనేది కేంద్రం ప్రభుత్వ పరిధిలోని సీసీఐ అంశమని చెప్పారు. అంతకు ముందు కాటన్ మిల్ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ తరఫున ఓ అధికారిని జిన్నింగ్ మిల్లుల వద్ద పర్యవేక్షణ కోసం నియమించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ జేడీ శ్రవణ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, వరలక్ష్మీ కాటన్ మిల్ యజమాని శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఏవో గౌతమ్ పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలి

సూర్యాపేటరూరల్ : రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలని రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు బీ.గోపి అన్నారు. సూర్యాపేట మండలం బాలెంలలోని మంజిత్ పత్తి మిల్‌ను సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకుని పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు తమ ఫోన్ నంబర్లు ఆప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం బాలెంల రైతు వేదికలో వ్యవసాయ అధికారులతో యాంత్రీకరణ, ఎరువుల నిల్వలు, వ్యవసాయ శాఖ పథకాలు, రైతులకు అందించే సబ్సిడీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఏవో శ్రీధర్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి నాగేశ్వరవర్మ, ఏవో కృష్ణసందీప్ పాల్గొన్నారు.

గాలి వ్యాధి నివారణ శిబిరం ప్రారంభం

చిట్యాలరూరల్ : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని రాష్ట్ర పశువైద్య, పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ బి. గోపి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లిలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించి పశువులకు టీకాలు వేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశువులకు వైరల్ వ్యాధిగా గాలికుంటు వ్యాధి సోకుతుందని ఆవ్యాధికి చికిత్స కంటే టీకాతో నివారణ తోనే సులువైన మార్గమన్నారు. గ్రామాల్లో ఉచిత టీకాల కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణలో పాడి పరిశ్రమ, పశు ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు అంతర్జాతీయంగా వ్యాపారాభివృద్ధి రైతుల ఆర్థిక వ్యవస మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్. జీవి రమేష్, చిట్యాల మండల పశువైద్యాధికారులు డాక్రట్ వి. అభినవ్, డాక్టర్ జె. అమరేందర్ పాల్గొన్నారు.

బీబీనగర్ ఎయిమ్స్ ఈడీగా ప్రొఫెసర్ అమితఅగర్వాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ అమితఅగర్వాల్

యాదాద్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా(ఈడీ) ప్రొఫెసర్ అమిత అగర్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని సంజయ్‌గాంధీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్‌జీపీజీఐ) నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిమ్స్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు వైద్యం అందించడంతో పాటు వైద్య విద్యార్థులకు అనుగుణంగా సంస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రతి విభాగంలో కొనసాగుతున్న కార్యకలాపాలు, అవసరాలపై ప్రత్యక్ష అవగాహన పొందేందుకు ఎయిమ్స్‌లోని అన్ని శాఖలను సందర్శిస్తానని, అన్ని విభాగాలతో సమన్వయంతో వైద్య సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని, తద్వారా సంస్థ బలోపేతం అవుతుందన్నారు. ఎయిమ్స్ పరిధిలో జరుగుతున్న అన్ని కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా రోడ్ మ్యాప్‌ను రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలు శాఖల అధిపతులు, సిబ్బంది ఈడీని అభినందించారు.

తగ్గుతున్న సాగర్ నీటిమట్టం

● ఎగువనుంచి 48,778 క్యూసెక్కుల వరద
● 587.20 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం రోజుకు 0.30 అడుగుల చొప్పున తగ్గుతోంది. ఈ నెల 21వ తేదీన 587.80 అడుగులు, 22వ తేదీన 587.50గా ఉన్న నీటిమట్టం గురువారం సాయంత్రానికి 587.20 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 7,033 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,556 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,089 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 48,778 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 48,778 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు)కాగా గురువారం సాయంత్రానికి 587.20 అడుగులు (305.6242టీఎంసీలు)గా నమోదైంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.60అడుగులు(4.36టీఎంసీలు)గా ఉంది.

బీఈడీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు సీవోఈ ఉపేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రెండో సెమిస్టర్‌లో 3,305మంది విద్యార్థులకు 2,681మంది విద్యార్థులు (81.14శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. నాలుగో సెమిస్టర్‌లో 2,552మంది విద్యార్థులకు2,419 (94.79శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

చెర్వుగట్టు ఆలయ ఈవోగా మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ముఖ్య కార్య నిర్వహణాధికారి సిరికొండ నవీన్‌కుమార్‌ను ఆలయ ఈవో బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వేములకొండ మత్స్యగిరి లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న మోహన్‌బాబును చెర్వుగట్టు దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడికి నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు.

ప్రభాతవేళ స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానకు వివిధ విభాగాల ద్వారా రూ. 5,34,898 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవి తెలిపారు. కాగా, కార్తీక మాసంలో కొండకింద ఆధ్యాత్మిక వాడలోని వ్రత మండపాల్లో 199 జంటలు వ్రతాలు చేశాయి. మొదటి విడత 44, రెండో విడత 64, మూడో విడత 55, నాలుగో విడత 19, ఐదో విడత 09, ఆరో విడత 08 వ్రతాలు నిర్వహించినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్‌రెడ్డి తెలిపారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గండ్ర

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా లడ్డు ప్రసాదం అందజేశారు.

చేనేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేనేత సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పద్మశాలి చేనేత కార్మిక సంఘం భూదాన్‌పోచంపల్లి అధ్యక్షుడు అంకం పాండు తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ ఎస్ఎల్‌బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) కమిటీతో రాష్ట్ర చేనేత కమిషనర్ కార్యాలయంలో భేటీ కాను న్నదని అన్నారు. కమిటీలో తీర్మాణం చేసిన తర్వాత పథకాల అమలు ప్రారంభించనున్నారని తెలిపారు. ఇప్పటికే చేనేత కేంద్రాలున్న నియోజకవర్గాలైన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఆలేరు ఎమ్మె ల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యయాదవ్, నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, రాజగోపాల్‌రెడ్డిలను రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్‌తోపాటు నాయకులు తడక రమేష్, భారత లవకుమార్ కలిసి సమస్యలను విన్నవించామని తెలిపారు. ఎప్పటికప్పుడు చేనేత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని అన్నారు.

31నుంచి మత్స్యగిరి లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి వలిగొండ మండలం వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అం తకు ముందు ఆలయ అధికారులు, పాలకవర్గం ఆయనకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. అక్టోబరు 31 నుంచి నవంబరు 5వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ మోహన్‌బాబు, చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు కరుణాకర్, వెంకటేష్, ప్రభాకర్, అంజయ్య, రవికుమార్, జగన్మోహన్‌రెడ్డి, రాములు, కేతమ్మ, వెంకటేశం, బాలేశ్వర్, శ్రీను, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మోత్కూరు విద్యార్థుల ఎంపిక

మోత్కూరు అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలోని కస్తూర్బా విద్యార్థినులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. మోత్కూరు హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -14, 17 ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరు త్వరలో హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఎస్‌వో యాదమ్మ గురువారం తెలిపారు.

కమనీయం.. ప్రకృతి అందం



సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లి గుట్ట, జాజిరెడ్డిగూడెం-అర్వపల్లి గ్రామాల మధ్యలో ఉన్న గుట్టలు ఆహ్లాదకరంగా కన్పిస్తున్నాయి. ప్రకృతి అందాలుతో పచ్చని గుట్టలు కనువిందు చేస్తున్నాయి. గుట్టల చుట్టూ పెద్ద పెద్ద చెట్ల మధ్యలో వివిధ రకాల పక్షులు కిలకిల రావాలతో కనువిందు చేస్తున్నాయి. దర్గా గుట్ట ఏటవాలుగా వెయ్యి అడుగుల లోతులో ఉంటుంది. లోయపల్లి గుట్టల్లో వివిధ రకాల జంతువులు మైమరిపిస్తున్నాయి. అడవి పందులు, నెమళ్లు, నక్కలు గుట్టల్లో జీవిస్తున్నాయి.

● ఆంధ్రజ్యోతి, అర్వపల్లి

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

చండూరురూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, ఇతర బెనిఫిట్స్‌కు నిధులను వెంటనే విడుదల చేయాలని మండల పరిధిలోని కొండాపురం ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు భూతం ముత్యాలు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023 జూన్‌లో సరెండర్ లీవ్స్ పెట్టుకున్నానని, రెండేళ్లగా ప్రభుత్వం ఈ బిల్లులను పెండింగ్‌లో ఉంచి నాలాంటి ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

'గోసంరక్షకుడిపై కాల్చిన వారిని కఠినంగా శిక్షించాలి'

చిట్యాలరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ తరలింపును అడ్డుకుని గోరక్షణ సేవలో ఉన్న గోసంరక్షకుడు సోనూసింగ్‌పై కాల్పులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిని అడ్డుకున్న సోనూసింగ్‌పై కాల్పులు జరపడం ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలన్నారు. దాడిలో పాల్గొన్న వారిని గుర్తించి వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

శ్రీనగర్, ఎన్జీవో కాలనీలో అస్తవ్యస్తంగా మట్టి రోడ్లు

బైపాస్ రోడ్డుకు సీసీ రోడ్ల లింకు కలిపేదెప్పుడో?

కొద్దిపాటి వర్షానికే రాకపోకలకు అంతరాయం

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్జీవో కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. మట్టి రోడ్లతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 19వ వార్డులోని శ్రీనగర్ కాలనీ, ఆ కాలనీ పక్కనే 3వ వార్డులోని ఎన్జీవో కాలనీలో రోడ్లు అధ్వానంగా మారడంతో సమస్యలు తప్పడం లేదు. నార్కట్‌పల్లి - అద్దంకి బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ రెండు కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తికాకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. బైపాస్‌లో మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఈ కాలనీలు శివారు ప్రాంతంలో ఉన్నాయి. అయితే కొద్ది రోజుల క్రితం 19 వార్డు లో పెద్దఎత్తున సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినా కాలనీల మధ్యలో నుంచి సీసీ రోడ్లను బైపాస్ రోడ్లకు లింకు ఇవ్వకపోవడంతో వర్షం వస్తే బురదమయంగా మారుతోంది. కాలనీల మధ్యలో రోడ్డు లేని పరిస్థితి ఉండగా కనీసం బైపాస్‌కు ప్రధాన రోడ్డును సీసీతో లింకు ఇచ్చినట్లయితే రాకపోకలు కొంత వరకు మెరుగయ్యే అవకాశాలు ఉంటాయి.

చౌడు నేలతో అధ్వానంగా దారులు

శ్రీనగర్ కాలనీతో పాటు ఎన్జీవో కాలనీలో అత్యధికంగా చౌడు నేల ఉండటంతో వర్షం వచ్చినప్పుడు బురదమయంగా మారుతున్నాయి. ఈ మార్గంలో వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అనేక సార్లు టూవీలర్‌తో పాటు కార్లు, స్కూల్ బస్సులు సైతం అదుపుతప్పి పోయిన పరిస్థితులు ఉన్నాయి. చౌడు నేలల్లో రోడ్డు వేసే వరకు అయిన మొరం పోసి ఉంటే ఈ పరిస్థితులు ఉండేవి కావని కాలనీవాసులు వాపోతున్నారు. వర్షం వచ్చినప్పుడు బాటలో నడవలేక చాలా మంది తమ పిల్లలను పాఠశాలలకు పంపించకుండా ఇళ్లకే పరిమితం చేస్తున్నారంటే పరిస్థితికి అద్దం పడుతుంది. తమ బాధను అధికారుల వద్దకు వెళ్లి చెప్పుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి చెందిన కాలనీ ప్రజల మాదిరిగానే ఇంటి నిర్మాణాలకు అనుమతి తీసుకొని ట్యాక్స్ చెల్లిస్తున్నామని, అలాంటప్పుడు అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఓపెన్ డ్రైనేజీ కూలిపోవడంతో మురుగు నీరుతో పాటు వర్షపు నీరు ఆ డ్రైనేజీలో నిల్వ ఉంటున్నాయి. దీంతో దోమల బెడద తీవ్రంగా ఉంటుంది. ఇకపోతే అమృత్ పథకం ద్వారా ట్యాంకు నిర్మాణం పూర్తయిన తర్వాత కనెక్షన్లు ఇస్తామంటున్నారని, అప్పటి వరకు నల్లా కనెక్షన్ లేకపోతే మంచినీరు ఎలా అని కాలనీవాసులు పేర్కొంటున్నారు.



కాలనీలో కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారిన రోడ్డు

అధికారులు పట్టించుకోవడం లేదు



రోడ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని అనేక సార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. వర్షం వచ్చినప్పుడు దారిలో నడవాలంటే పడిపోయే ప్రమాదం ఉంది. వాహనాలు కూడా నడిపే పరిస్థితి లేదు. కాలనీలో నుంచి వెళ్లే సీసీ రోడ్లను బైపాస్ రోడ్డుకు లింకు చేయాలని అనేక సార్లు కోరామని, అయిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. తక్షణమే రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి కాలనీని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

- మంగిలిపల్లి కిషన్, శ్రీనగర్ కాలనీ

వర్షం వస్తే భయంకరంగా మారుతుంది



వర్షం వచ్చినప్పుడు రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయి. బైక్‌తో పాటు కార్లు, స్కూల్ బస్సులు సైతం అదుపు తప్పి రోడ్డు నుంచి జారిపోతున్నాయి. వర్షం వచ్చినప్పుడు రాకపోకలకు అంతరాయం జరుగుతుంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. దీంతో ఎన్జీవో కాలనీ ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

- డి.చైతన్య, ఎన్జీవో కాలనీ

మంత్రి, ఎంపీకి క్షమాపణ చెప్పాలి

చిట్యాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల దేవదాస్ డిమాండ్ చేశారు. చిట్యాలలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి, ఎంపీని విమర్శించే స్థాయి గాదరి కిషోర్‌కు లేదన్నారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న మంత్రి, ఎంపీని విమర్శించడం తగదన్నారు. కిషోర్ అక్రమాలు చేసి తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని విమర్శించారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, సిలివేరు శేఖర్, ఎల్లయ్య, మధు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే కిశోర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జిల్ల పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1500 ఓట్ల మెజార్టీతో గెలిచిన కిషోర్ 2లక్షల ఓట్ల మెజార్టీతో ఎంపీగా గెలిచిన చామలను ఉద్దేశించి అనుచితంగా మాట్లాడం శోచనీయమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పకపోతే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు తిరుగుడు రవి, బోడ సత్యనారాయణ, మేడబోయిన అభి, సిర్పంగి మహేందర్, డెంకట స్వామి, బోయిని మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

'కిషోర్‌కుమార్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు'

శాలిగౌరారం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు మామిడి రమేష్ అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిన కిషోర్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బట్ట వీరబాబు, బాకీ వెంకన్న, పనికెర కమాలకర్, యమగాని వెంకన్న, తీగల వెంకన్న, దేవరకొండ సైదులు, ఐలపాక నాగరాజు, షేక్ షరీఫ్, గుండ్ల రవి, మొలుగురి ప్రభు, ఐలపాక అశోక్, బట్ట కిరణ్, తీగల సైదులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

కట్టంగూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండల కేంద్రంలో ఈనెల 25వ తేదీన జరిగే తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నల్లగొండ జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఆ సంఘం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించాలని, ప్రతీ సొసైటీకి 5ఎకరాల భూమి ఇవ్వాలని ఉన్న జీవో 560ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రతి కేంద్రంలో నెలకొల్పాలన్నారు. మహాసభకు కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అ ధ్యక్షుడు మాద శ్రీను, గౌరవాధ్యక్షులు చెవుగోని లింగయ్య, ఉపాధ్యక్షుడు పనస యాదయ్య, ఆకుల శంకరయ్య, సత్తయ్య, వేముల సైదులు, నీలం అంజయ్య, అనంతుల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎంబీసీలుగా గుర్తించాలి

చిట్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన రజకులను ఎంబీసీలుగా గుర్తించాలని రజకసంఘం జిల్లా అధ్యక్షుడు చెరుకు పెద్దులు డిమాండ్ చేశారు. గురువారం చిట్యాలలో నిర్వహించిన రజకసంఘం వార్షికోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో రజకులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి రజకులు సంఘటితంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు యాదయ్య, నాయకులు అక్కెనపల్లి నాగయ్య, పాలమాకుల అర్జున్, పెద్దులు, శేఖర్, రాములు పాల్గొన్నారు.

గురుకులాలకు ఒకే టైం టేబుల్ అమలు చేయాలి

నకిరేకల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనసాగుతున్న ఆయా గురుకులాల సొసైటీలన్నింటికీ ప్రభుత్వం ఒకే టైమ్‌టేబుల్ అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం డిమాండ్ చేశారు. మండలంలోని ఆయా గురుకులాల సొసైటీలలో గురువారం నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉదయం 9 నుంచి మైనార్టీ గురుకులాలను అమలు చేస్తున్న టైంటేబుల్‌ను మిగతా గురుకుల సొసైటీల్లో కూడా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. నర్సింహమూర్తి, కురిమిల్ల శ్రీనివాస్, జి. శ్రీలత, పి. జ్యోతి, హరికృష్ణ, జయసాగర్ పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ అభినందనీయం

నకిరేకల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రోగులకు అల్పాహారం అందించడం అభినందనీయమని నకిరేకల్ క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ అన్నారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ సహకారంతో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు కుమారుడు కార్తీక్ జన్మదినం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు తల్లి నాగమణి, సోదరి దివ్యల దాతృత్వంతో గురువారం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, సహాయకులు 100 మందికి అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఛాయా సోమేశ్వరాలయంలో వెబ్ సిరీస్ చిత్రీకరణ

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణానికి చెందిన కళాకారుడు సోమనబోయిన సాయికుమార్ దర్శకత్వంలో నిర్మిస్తున్న వెబ్ సిరీస్ షూటింగ్ చిత్ర సన్నివేశాలు గురువారం పానగల్లులోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో ఆవరణలో చిత్రీకరించారు. ఆలయంలోని శివలింగానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై తొలి క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఆవరణలో వెబ్ సిరీస్ మూవీకి సంబంధించిన కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఓం మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ సినిమాను నల్లగొండలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

● డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



అక్కెనపల్లి పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నార్కట్‌పల్లి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో పనిచేసే సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి, నార్కట్‌పల్లి పీహెచ్‌సీలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను, ఔషధాల నిల్వల రికార్డు, ఓపీ రిజిస్టర్‌ను డీఎంహెచ్‌వో పరిశీలించారు. ల్యాబోరేటరీలో వివిధ రకాల పరీక్షలను తెలుసుకున్నారు. ఆరోగ్యానికి సంబంధించి జాతీయ కార్యక్రమాలైన టీబీ, లెప్రసీ, ఎన్‌సీడీ, మాతా శిశుసంరక్షణ కార్యక్రమాల అమలుతీరు నివేదికలను ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారుల ద్వారా తెలుసుకున్నారు. మాతా శిశుసంరక్షణపై ఇంకా శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయనివారణ అధికారి కల్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారు లు విజయ్‌కుమార్, వరూధిని, శ్రీలక్ష్మి, యాదగిరి, పద్మ, రాంచందర్‌రావు, మురారిశెట్టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కాంటా వేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల

కేతేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల కోరారు. కేతేపల్లి మండలంలోని భీమారం, బొప్పారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో గు రువారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. చివరి ధాన్యం గింజను కొనుగోలు చేసే వరకూ కొనుగోలు కేంద్రాలు పని చేస్తాయని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చే ధాన్యాన్ని సకాలంలో కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఆర్ఐ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు జి.మాధవరెడ్డి, బడుగుల నరేందర్, బి.రవీందర్, ఎస్ఆర్పీ శాంత, సీసీలు రాజ్‌కుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం పట్టని ప్రభుత్వం : చిరుమర్తి



పెద్దకాపర్తి శివారులో పత్తిచేనులో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

చిట్యాలరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల సంక్షేమం జాడలేదని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి బోనస్ ఊసేలేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో పత్తి చేలను గురువారం ఆయ న పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిరుమర్తి మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగం అభ్యున్నతిని పట్టించుకునే పరిస్థితిలో లేదని విమర్శించారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌కు దిక్కేలేదని అన్నారు. పత్తిని కొనుగోలు చేసే సమయం వచ్చినా కూడా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం రైతులపై ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. రైతులు పత్తిని నిల్వ చేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు కళ్లెదుటే పత్తి తడిసిపోతున్నా ఏం చేయలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సాగు సీజన్‌లో సకాలంలో ఎరువులు, యూరియాను అందించడంతో విఫలమైందని, పండించిన పంటలను కొనుగోలు చేసే సోయి కూడా లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కనాడైనా తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం చొరవ తీసుకోలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటులో చొరవ తీసుకోవాలన్నారు.

దారి ఇలా.. బడికి వెళ్లేదెలా?

● పాఠశాలకు వెళ్లే మార్గాన్ని కమ్మేసిన చెట్లు, ముళ్లపొదలు



పాఠశాలకు వెళ్లే దారిని కమ్మేసిన కంపచెట్లు

మర్రిగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల పరిధిలోని వట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే బడిబాట ఇరువైపులా చెట్లు, ముళ్ల పొదలు కమ్మేయడంతో విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దారికి ఇరువైపులా చెట్లు, కంపపొదలు ఎదిగి దారి కనబడలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ఈ దారి గుండా వెళ్లాలంటే అడ్డంగా ఉన్న కంపచెట్లను చూసి విద్యార్థులు భయపడుతున్నారు. విద్యార్థులు ఈ దారి నుంచి వెళ్లాలంటే జంకుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కంప, చెట్లపొదలను తొలగించి విద్యార్థులు వెళ్లడానికి అనుకూలంగా చేయాలని వారు కోరుతున్నారు.

'రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి'

మర్రిగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు మేతరి యాదయ్య కోరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజగోపాల్‌రెడ్డి మునుగోడు నియోజకవర్గాన్ని తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 18 జడ్పీ హైస్కూళ్లను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేశాడన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామదాసు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఏర్పుల శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ లింగారెడ్డి, నాయకులు గ్యార వెంకట్, రవి, కిరణ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దివీస్ సహకారం అభినందనీయం



గుండ్రాంపల్లిలో సంచులు, పుస్తకాలు అందుకున్న వారితో ఎంఈవో, ఉపాధ్యాయులు, దివీస్ ప్రతినిధులు

చిట్యాలరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి దివీస్ యాజమాన్యం సహకరించడం అభినందనీయని ఎంఈవో పి.సైదానాయక్ అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి, ఏపూర్, పేరేపల్లి, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దివీస్ లాబొరేటరీస్ సౌజన్యంతో రూ. 7,17లక్షల విలువైన బ్యాగులు, నోట్ పుస్తకాలను ఆయన విద్యార్థులకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా పేద సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉంటారని, అలాంటి వారికి బ్యాగులు, నోట్‌బుక్కులను అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటునందించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, టీచర్లు హేమలత, మోహన్‌రెడ్డి, అంజయ్య, పాండు, దివీస్ ప్రతినిధులు ఎస్. సాయికృష్ణ, వి. వంశీకృష్ణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోతల వేళ ఆశలు ఆవిరి

(5వ పేజీ తరువాయి)

సాగుచేయగా, వరి 5.42 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. పత్తి కాయ పగిలి తీత పనులు సాగుతుండగా వరి కోతదశకు చేరిన సమయంలో కురుస్తున్న వర్షాలకు ఫలితం చేతికి అందకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **మార్కెట్ నిబంధనలకు వాతావరణ ప్రతికూలం**

పంటను మార్కెట్‌లో విక్రయించాలంటే సీసీఐ, ఐకేపీ కేంద్రాల నిబంధనలకు అనుగుణంగా రైతులు సరుకును తీసుకురావాల్సి ఉంటుంది. జిల్లాలో నాగార్జునసాగర్, మునుగోడు, నల్లగొండ ప్రాంతాల్లో పత్తి చేలు ముందు వేయడంతో కాయలు పగిలి ఫస్ట్ పికింగ్ పనులు సాగుతుండగా దేవరకొండ ప్రాంతంలో మరికొద్ది రోజుల్లో పత్తితీత పనులు మొదలయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. రోజు వర్షపు జల్లులు కురుస్తుడటంతో తేమ శాతం అధికంగా ఉంటోంది. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే క్వింటాకు రూ. 8,110 ధర వెచ్చించి పత్తిని కొనుగోలు చేస్తుడటంతో తేమశాతం రైతుకు పాలిటశాపంగా మారుతోంది. నాన్ ఆయకట్టు ప్రాంతంలో బోరు బావుల కింద వరి సాగు చేసిన రైతులు కోతలు ప్రారంభించారు. ఆయకట్టులో మరో 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఐకేపీ కేంద్రాల్లో 17 శాతం తేమ ఉంటేనే గ్రేడ్ వన్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,389 చెల్లించనున్నారు. కానీ ధాన్యం ఆరబెట్టుకునే వాతావరణమే లేదని రైతులు వాపోతున్నారు. వర్షాల కారణంగా పూర్తి ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్నాయి. వర్షాలకు తోడు భారీగా చలిగాలులు వీస్తుండటంతో పంట చేలు నీళ్ల పాలవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. దిగుబడి సగానికి తగ్గిపోయి రైతు కుటుంబాలు ఆర్థికంగా ఛిద్రమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని కంటతడి పెడుతున్నారు.

అప్పుల పాలయ్యాం.. ఆదుకోరూ

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. కొన్ని పాఠశాలల్లో పనులను పూర్తి చేసినప్పటికీ ఎస్ఎంసీ చైర్మన్‌లకు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. ఆర్థిక స్థోమతలేని చైర్మన్లు అప్పులు తెచ్చి పనులు చేసినప్పటికీ బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బిల్లులు పెండింగ్ ఇలా..

మన ఊరు, మనబడి పథకంలో చేపట్టిన పనులకు జిల్లావ్యాప్తంగా రూ.18కోట్ల బిల్లులు పెండింగ్ ఉండగా, దేవరకొండ నియోజకవర్గంలో రూ.6కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. చందంపేట మండలంలో రూ.43.6లక్షలు, చింతపల్లి మండలంలో రూ.55.2లక్షలు, దేవరకొండ మండలంలో రూ.75.6లక్షలు, గుడిపల్లి మండలంలో రూ.95.63 లక్షలు, డిండి మండలంలో రూ.1.13కోట్లు, కొండమల్లేపల్లిలో రూ.28.98లక్షలు, నేరేడుగొమ్ములో రూ.29లక్షలు, పీఏపల్లిలో రూ.1.13కోట్లు పాఠశాలల్లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

వడ్డీలు కట్టలేకపోతున్నా

బిల్లులు వస్తాయని అప్పు తెచ్చి మన ఊరు, మనబడి పథకంలో పనులు చేశాను. పనులు పూర్తి చేసినా బిల్లులురాక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నా. చేసిన పనులకు రూ.14లక్షలు రావాల్సి ఉంది.

- ఎలిజాల మాదవయ్య, గోనబోయినపల్లి

పత్తి రైతుకు తేమ తంటా

(5వ పేజీ తరువాయి)


పింజ పొడవును 27.50 నుంచి 28.50 మి.మీలుగా ప్రామాణికంగా మద్దతు ధరను చెల్లిస్తారు. అదేవిధంగా తేమ శాతాన్ని 8 శాతం నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కొనుగోలు ఆటంకం లేకుండా నిబంధనలు....

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఈసారి పత్తి కొనుగోళ్లకు ఆటంకం లేకుండా అనేక నిబంధనలతో ముందుకు వచ్చింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు, వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లకు సమయాత్తం అవుతుంది.

కపాస్ కిసాన్ మొబైల్ యాప్ అమలు

2025-26 సంవత్సరానికి ఎంఎస్పీ కింద సీసీఐ పత్తి విక్రయించడానికి కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను ప్రతీ రైతు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ నెంబర్, ఓటీపీ ద్వారా లాగిన్ చేయాల్సి ఉంటుంది. రైతుల కనీస మద్దతు ధర పథకం కింద రైతుల ప్రయోజనం చేకూర్చడానికి కపాస్ కిసాన్ యాప్‌ను అమలు చేస్తున్నారు. ప్రతీ రైతు స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తిని అమ్ముకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ఈసారి డాటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా కలెక్టరేట్ నుంచే గుర్తించిన వారిని కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. గతంలో కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో సమస్యలతో పాటు రైతులకు ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో కొనుగోళ్లు పారదర్శకంగా ఉండటంతో రైతుల సమస్యలు తొలగించడం కోసం అనేక సంస్కరణలతో కొనుగోలు చేపట్టాలని నిర్ణయించారు. అయితే అడపాదడపా కురిసిన వర్షాలు రైతులకు ఏ మేరకు మద్దతు ధర వస్తుందో లేదా అనే సందేహం మాత్రం సర్వత్రా వ్యక్తమవుతుంది. అధికారుల నిబంధనల మేరకు రైతులు ముందుకు రాకపోతే ఎట్టి పరిస్థితుల్లో పత్తి కొనుగోలు చేయమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY


ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	48,778	48,778
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	1976.02	1420.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.309 (43.548)	13,110	37,847

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

4,905
మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు



మద్యం దుకాణాలకు జిల్లావ్యాప్తంగా 4,905 దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ సంవత్సరం-2025-27కు సంబంధించి జిల్లాలో ఏ-4 కేటగిరీ 154 మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని రామగిరి వద్ద ఉన్న జిల్లా ఎక్సైజ్‌కార్యాలయం, మిర్యాలగూడ రోడ్డులోని ఎక్సైజ్‌స్టేషన్ వద్ద దరఖాస్తులను స్వీకరించారు.
(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- వచ్చిన ఆదాయం 147.15కోట్లు
- గతం కంటే స్వల్పంగా పెరిగిన ఆదాయం
- దర్వేశిపురంలో అత్యధికంగా 154 దరఖాస్తులు
- 27న లక్ష్మీగార్డెన్స్‌లో దుకాణాలకు లక్కీడ్రా

వాస్తవానికి గత శనివారమే గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం 23వ తేదీవరకు గడువు పొడిగించడంతో గురువారం సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించారు. శనివారం అర్ధరాత్రి వరకు 4610 దరఖాస్తులు రాగా, ఈ నాలుగురోజుల్లో అదనంగా 295 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 4,905 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి బి.సంతోష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 154 దుకాణాల్లో ఎస్టీలకు 4, ఎస్సీలకు 14, గౌడ సామాజికవర్గానికి 34 షాపులు కేటాయించగా అన్నింటికీ దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా జనరల్ దుకాణాలకు, మండలాల్లో ఒక్కో దుకాణం ఉన్న చోట, పట్టణాల్లో, జాతరలు, ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, హైవే, పరిశ్రమలున్న ప్రాంతాల్లోని దుకాణాలకు ఎక్కువ దరఖాస్తులొస్తాయని భావించినట్లే వచ్చాయి. ఈ దరఖాస్తులన్నింటినీ కలిపి దుకాణాల వారీగా కలెక్టర్ సమక్షంలో ఈ నెల 27వ తేదీన జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో లక్కీడ్రా నిర్వహించి లైసెన్స్‌దారులను ఎంపికచేస్తారు. ఎంపికైన లైసెన్స్ దారులకు 1, డిసెంబరు 2025 నుం చి 30 నవంబరు 2027 వరకు ఆయా దుకాణాల్లో వ్యాపారం నిర్వహించుకునేందుకు అనుమతిస్తారు.

దర్వేశిపురం దుకాణానికి 154 దరఖాస్తులు

నల్లగొండ డివిజన్ పరిధిలోని దర్వేశిపురం మద్యం దుకాణానికి జిల్లాలో అత్యధికంగా 154 దరఖాస్తులొచ్చాయి. ఆ తర్వాత వెలిమనేడు దుకాణానికి 82, కంచనపల్లికి 74 దరఖాస్తులు వచ్చాయి. చండూరు, నందికొండల్లోని దుకాణాలకు అత్యల్పంగా 18 చొప్పున దరఖాస్తులు రాగా, తిరుమలగిరి, నాంపల్లి, మర్రిగూడ, నందికొండ, నకిరేకల్ దుకాణాలకు 19 చొప్పున, నకిరేకల్, చండూరు, మునుగోడులోని మూడు దుకాణాలు, హాలియా దుకాణాలకు 20 చొప్పున, పీఏపల్లి, నకరేకల్, త్రిపురారం, మర్రిగూడ, నాంపల్లిలలోని దుకాణాలకు 21 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ప్రతీ దుకాణానికి 15 కంటే తక్కువ వస్తే, అక్కడ సిండికేట్ అయినట్లు భావించి రీటెండర్లు పిలిచే అవకాశముంది. అయితే నల్లగొండ జిల్లాలో అన్ని దుకాణాలకు 18కి మించి దరఖాస్తులు రావడంతో రీ టెండర్ల అవసరం లేదని చెబుతున్నారు. అన్ని దుకాణాలకు పోటాపోటీగానే దరఖాస్తులురావడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా	దరఖాస్తులు	ఆదాయం
యాదాద్రి	2776	రూ.83.28కోట్లు
నల్లగొండ	4905	రూ.147.15కోట్లు
సూర్యాపేట	2758	రూ.82.74కోట్లు
మొత్తం	10,452	రూ.313.56కోట్లు

ఈనెల 27న లక్ష్మీగార్డెన్స్‌లో లక్కీడిప్

ఈ దరఖాస్తుల ద్వారా దుకాణాల వారీగా నిర్వాహకులను ఈ నెల 27న లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో ఈ లక్కీడ్రా కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

దుకాణాల వారీగా వచ్చిన దరఖాస్తుల నెంబర్లతో లక్కీడిప్ నిర్వహిస్తారు. ఇలా ఎంపికైన వారందరికీ వచ్చే డిసెంబర్ నుంచి రెండేళ్లపాటు ఆయా మద్యం దుకాణాల వ్యాపారం నిర్వహించుకునేందుకు అనుమతిస్తారు.

గతం కంటే పెరిగిన ఆదాయం



జిల్లాలో తాజాగా జరిగిన మద్యం టెండర్లలో ఎక్సైజ్‌శాఖకు దరఖాస్తుల ద్వారా వచ్చే ఆదాయం గతం కంటే పెరిగింది. వాస్తవానికి దరఖాస్తులు తగ్గినా, దరఖాస్తు రుసుము (నాన్ రీఫండబుల్) విలువ గతంలో రూ.2లక్షలుంటే, ఈసారి అది రూ.3లక్షలకు పెంచడంవల్ల దరఖాస్తులు తగ్గినా స్వల్పంగా ఆదాయం పెరుగుదల నమోదైంది. 2023-25 టెండర్లలో మొత్తం 155 దుకాణాలకుగాను 7,057 దరఖాస్తులు రాగా, రూ.141.114 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలో సమకూరడం అప్పట్లో రికార్డుగా పేర్కొంటే, ఈసారి దరఖాస్తు రుసుము పెరిగిన నేపథ్యంలో అంతకుమించి ఆదాయం నమోదవడంతో ఎక్సైజ్ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా 4905 దరఖాస్తులు రాగా, రూ.147.15 కోట్ల ఆదాయం సమకూరింది.

'మన ఊరు- మన బడి' పనులు చేసి..

అప్పులపాలయ్యాం

- ఆదుకోరూ..: ఎస్‌ఎంసీ చైర్మన్ల ఆవేదన
- జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్లు పెండింగ్


డిండి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసిన పాఠశాల భవనం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మన ఊరు - మన బడి పథకంలో చేపట్టిన పనులకు జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు చేసిన తాము అప్పులపాలయ్యామని ఎస్‌ఎంసీ చైర్మన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
(ఆంధ్రజ్యోతి-డిండి)

డిండి మండలంలో 2022-23లో మన ఊరు, మనబడి పథకంలో భాగంగా 17 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. పాఠశాల నిర్మాణ వ్యయం రూ.30లక్షలకు పైగా ఉన్న చెర్కుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, డిండి, తవక్లాపూర్ ఉన్నత పాఠశాలతోపాటు డిండి, తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాలలకు టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న కంట్రాక్టర్లు పనులు చేపట్టారు. మిగిలిన 12 పాఠశాలల పనులను ఎస్‌ఎంసీ చైర్మన్‌లు చేశారు. ఆర్థిక స్థోమతలేని ఎస్‌ఎంసీ చైర్మన్‌లు కొందరు ఇతరులకు పనులు అప్పగించారు. 17 పాఠశాలల పనుల్లో 10 పూర్తికాగా మరో ఏడు పాఠశాలల పనులు కొంతమేర అసంపూర్తిగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో ఎంపిక చేసిన పాఠశాలలకు మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్ నిర్మాణం వంటి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మన ఊరు, మన బడిలో ఎంపిక చేసిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వంట గది, ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మండలంలో ఎంపిక చేసిన 17 పాఠశాలల్లో చేపట్టిన పనులకు రూ.4కోట్లు చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో.. మిగతా 8వ పేజీలో..

నేరాల అదుపునకు

ప్రత్యేక దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, వాటిని అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా పోలీస్‌శాఖ పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగాలన్నారు. పెరిగిపోతున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పనిచేయాలన్నారు. నిఘా వ్యవస్థకు దోహదపడుతున్న సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. నేరం చేసే వారికి శిక్ష పడాలని, నేరం చేయని వారికి రక్షణగా ఉండాలని ఆయన సూచించారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యంతో పాటు ఇసుక అక్రమ రవాణా వంటి వాటిపై దృష్టి సారించాలని ఎస్పీ అన్నారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా సమావేశాల్లో అదనపుఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాఘవరావు, రాము, మహాలక్ష్మయ్య, కరుణాకర్, రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐలు సంతోష్, శ్రీను పాల్గొన్నారు.

కోతల వేళ.. ఆశలు ఆవిరి

- రైతు వెన్ను విరిచిన గాలివాన
- వర్షాలతో అన్నదాత ఇక్కట్లు
- వరికోత, పత్తితీత ఎలా?


గాలివానతో నేలకొరిగిన వరిచేలు

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

గాలివానతో రైతుల వెన్ను విరిగింది. కోతకు వచ్చిన పంట నేలకు ఒరిగి రైతుల కంటతడి పెట్టిస్తున్నాయి. బుధవారం వానతో పాటు బలమైన గాలులు వీచాయి. దీంతో ఆయకట్టులో అనేక చోట్ల ఇప్పుడిప్పుడే ఈత వేస్తున్న వరి మొదలు నేడో రేపో కోత కోసే వరి పంట కూడా నేలకరుచుకపోవడంతో చేతికొచ్చిన పంట నేలపాలైందని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు.

వరి ఎన్నులు నీటిలో నాని వరిగింజలు మొలకలు వచ్చి పనికి రాకుండా పోయే అవకాశం ఉందని వాపోతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేయగా పంట చేతికి వచ్చే సమయంలో వర్షం పడి పంటలను అతలాకుతలం చేసిందని పలువురు రైతులు వాపోతున్నారు. పత్తి తీత పనులు ముమ్మరంగా సాగుతుండగా వర్షం కురవడంతో పత్తి తడిచి నల్లగా మారుతోందని వాపోతున్నారు. వీటివల్ల పూర్తిగా దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతామని కర్షకులు కంటనీరు పెడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిసి తల్లడిల్లుతున్నారు.

నాడు పంటలకు జీవం

వానాకాలం ప్రారంభంలో వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయన్న ఆశాభావంతో సాగుకు సిద్ధమైన రైతులకు భంగం కలిగింది. ఆగస్టు నెల వరకు సగటు వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో మెట్ట పంటలు మొలకెత్తక పోగా మొలిచిన పత్తి మొక్కలు వాడుపడింది. ఆగస్టు నెలలో అడపాదడపా కురిసిన వర్షాలకు మొలకలకు జీవం పోయడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు సాగర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండి ఉరకలెత్తడంతో సాగర్ ఎడమకాల్వ కింద ఆయకట్టుకు ఆగస్టులో నీరు విడుదల చేయడంతో చకచకా వరి నాట్లు పూర్తి చేశారు. మొత్తంగా నల్లగొండ జిల్లాలో 5.76 లక్షల ఎకరాల్లో పత్తి మిగతా 8వ పేజీలో..



పత్తి రైతుకు

తేమ తంటా

- అడపాదడపా కురుస్తున్న వానలతో రంగు మారుతున్న పత్తి
- నేటి నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు
- క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.8,110

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతును తేమ తంటా వేధిస్తోంది. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలు పత్తి రైతును కుంగదీస్తున్నాయి. వానలతో పత్తి రంగు మారుతోంది. ఖరీఫ్‌లో 5.68 లక్షల పత్తి సాగు చేశారు. అయితే ఈ ఏడాది తెగుళ్ల బెడదతో పాటు వివిధ కారణాలతో పత్తి 50శాతం మేరకే దిగుబడి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉంటే ప్రతీ ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుతం 5 నుంచి 6 క్వింటాళ్ల వస్తుందా? రాదా? అనేది రైతులను వెంటాడుతోంది. అధికారులు మాత్రం జిల్లాలో 57,23,951 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే అందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వ్యవసాయ, మార్కెటింగ్ అధికారుల లెక్కల ప్రకారం ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినా ఆ తర్వాత వాతావరణ మార్పులతో రైతుల ఆశలు సన్నగిల్లాయి. అత్యధికంగా ఎర్ర తెగులు మూలంగా దిగుబడులపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది.

నాణ్యత ఉంటేనే క్వింటాకు రూ.8,110 చెల్లింపు

పత్తి కొనుగోళ్లను సీసీఐ శుక్రవారం నుంచి ప్రారంభించడానికి సన్నద్ధమవుతుంది. జిల్లాలోని 23 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేపట్టనున్నారు. అయితే ఒకటి రెండు జిన్నింగ్ మిల్లుల్లో సాంకేతిక సమస్యల వల్ల రెండు రోజులు ఆలస్యంగా కొనుగోలు జరుగుతాయని సమాచారం. నాణ్యత ఉంటేనే క్వింటాకు రూ.8,110 చెల్లిస్తారు. తేమ సమస్య ఎదురైతే మాత్రం కొనుగోళ్ల ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. నాణ్యత విషయాన్ని అధికారులు మూడు రకాలుగా పరిశీలిస్తున్నారు. పింజ రకం బట్టి నాణ్యత ఉంటే క్వింటాకు రూ.8,110, ఆ తర్వాత నాణ్యతను బట్టి రూ.8,060, మూడో రకానికి సంబంధించి క్వింటాకు రూ.8010 చెల్లిస్తారు. మొదటి రకంలో పింజ పొడుగు 29.5 మి.మీల నుంచి 30.5 మి.మీలు చూస్తారు. రెండో రకంలో పింజ పొడువు 29.01 నుంచి 29.49 మి.మీలు, మూడో రకం మిగతా 8వ పేజీలో..




ఆదివాసీ సంప్రదాయ దుస్తుల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాధవి దంపతులు

గిరిజనులు కాదు..

ఎమ్మెల్యే దంపతులు

- వినూత్నంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం
- అరకులో ఆదివాసీ సంప్రదాయ రీతిలో వేడుక

6

పాఠశాలకు స్థలాన్ని నిర్ధారించండి

మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ స్థలానికి హద్దులు నిర్ధారించి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ మండల పరిధిలోని జప్తివీరప్పగూడెం వద్ద 214 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణం చేపట్టేందుకు 25 ఎకరాల స్థలం అవసరమవుతుందని, ఆ స్థలానికి హద్దులు నిర్ధారించి మ్యాప్‌తో సహా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పాఠశాల భవన నిర్మాణంలో భాగంగా తరగతి గదులు, హాస్టల్, డార్మెటరీ, లైబ్రరీ, ల్యాబ్‌లు, ఆట స్థలం, ఆడిటోరియాలను అధునాతన సౌకర్యాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్, మిర్యాలగూడ తహసీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.


జప్తివీరప్పగూడెం వద్ద ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

అధైర్యపడకు.. అండగా ఉంటా : కలెక్టర్

వేములపల్లి, మాడ్గులపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తనకు ఎవరూ లేరని అధైర్య పడకుండా మనోధైర్యంతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి చిన్నారి పున్నా నిత్యకు మనోధైర్యాన్ని కల్పించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. మాడ్గులపల్లి మండలంలోని ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన పున్నా నిత్య తండ్రి సాంబయ్య, సోదరుడు శివమణి గణేష్ నిమజ్జనం సందర్భంగా మృత్యువాతపడ్డారు. అప్పటికే చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన నిత్య తండ్రి, సోదరుడు శివమణి మృతి చెందడంతో ఒంటరి అయింది. గ్రామస్థులు, బంధువులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు కలెక్టర్‌కు నివేదించారు. స్పందించిన కలెక్టర్ నిత్యకు రూ.5లక్షల చెక్కును వేములపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం ఉన్నా స్థానిక సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని, అండగా ఉంటామని సూచించారు. చెక్కును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీతో తన చదువుకు, భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్లు హేమలత, సరోజపావని, డీటీలు కోటేశ్వరి, సైదులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


నిత్యకు రూ.5లక్షల చెక్కును అందిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, పక్కన సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

క్రీడా జట్ల ఎంపిక పోటీలు


బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఉపేందర్

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అండర్- 14,17 బాలబాలికల బాస్కెట్‌బాల్, బీచ్ వాలీబాల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సముద్రాల ఉపేందర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన ఎంపిక పోటీల్లో బాల, బాలికలు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. అత్యంత ప్రతిభ కనబరిచి గెలుపొందిన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ జట్టుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, వీసం, రాజు, అశ్రఫ్, జంగయ్య పాల్గొన్నారు. అదేవిధంగా మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన చెస్ క్రీడా పోటీలను డీవైఎస్‌వో అక్బర్‌అలీ ప్రారంభించారు. అండర్-14, 17 బాలబాలికలు పాల్గొని పోటీ పడ్డారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కుంభం నర్సిరెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, గఫార్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

- రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి


నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లిలో కాటన్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న గోపి, కలెక్టర్ ఇలాత్రిపాఠి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

7

డిండిలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు

డిండి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలను గురువారం ప్రారంభించినట్లు ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఉమర్ తెలిపారు. షాదీఖానా నుంచి గంధం ఊరేగింపు మహబూబ్ సుభాని దర్గా వద్దకు చేరుకుందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సుభాని దర్గాను గ్యార్వీ షరీఫ్ ఉత్సవాల నిర్వాహకులు అందంగా అలంకరించారు.

డ్రంకెన్ డ్రైవ్ చేయవద్దు: ఎస్ఐ రాంమూర్తి

చింతపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడపొద్దని చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి సూచించారు. గురువారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర చెక్ పోస్టు సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనదారులకు బ్రీత్ ఎనలైజింగ్ పరీక్ష చేసి కేసులు నమోదు చేశారు. ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది సైదులు, వెంకటేష్, శ్రీనివాస్, నిరంజన్ ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు



మాడ్గులపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వేములపల్లి, మాడ్గులపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం, బుగ్గబావిగూడెం, మొల్కపట్నం, సల్కునూరు గ్రామాల్లో నేలవాలిన పంట పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అదేవిధంగా మాడ్గులపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.40వేల మేర పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట పొలాలు మరో 15రోజుల్లో కోత దశకు వస్తుండగా వర్షాలకు నేలవాలడంతో పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి ఎకరాకు రూ.30వేల పరిహారాన్ని అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. మాడ్గులపల్లిలోని ఐకేపీ కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకువచ్చి 15రోజులు అయిందని, తేమశాతం వచ్చినప్పటికీ కాంటాలు వేయనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. సరైన తేమశాతం వచ్చిన ధాన్యానికి అధికారులు వెంటనే కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని, మిల్లర్లు కూడా రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని, లేనట్లయితే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, రైతు సంఘం నాయకులు పాల్వాయి రాంరెడ్డి, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, కోడిరెక్క వెంకన్న, పుట్టల సైదులు, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, దొంగరి కృష్ణ దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, పాదూరి గోవర్ధని, నాగయ్య, రైతులు ఎల్లయ్య, మల్లమ్మ, సుదర్శన్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రహదారులు

● గుంతలమయంగా మారుతున్న రోడ్లు
● దశాబ్దకాలమైనా పూర్తికాని బీమారం- సూర్యాపేట మార్గం
● అసంపూర్తిగా నిలిచిన సల్కునూరు- సీత్యాతండా, జగ్గుతండా రోడ్లు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గుంతలమయంగా మారిన భీమారం- సూర్యాపేట రహదారి

వేములపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ప్రారంభించిన పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమారం- సూర్యాపేట రోడ్డుకు సంవత్సరాలు గడుస్తున్నా మోక్షం కలగడం లేదు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి, ఇటు మిర్యాలగూడ వాణిజ్య పట్టణానికి అనుసంధానంగా ఉంటూ నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఇటీవల హామీ ఇచ్చినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం సమీపంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారి నుంచి సూర్యాపేట పట్టణం వరకు 28 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి సుమారు తిమ్మిదేళ్ల క్రితం రెండు విడతలుగా రూ.49.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2019 నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉన్నా నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే రెండు జిల్లాలతో పాటు మిర్యాలగూడ నుంచి సూర్యాపేటకు తక్కువ సమయంలో వెళ్లేందుకు వీలుంటుంది. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



సల్కునూరు, మంగాపురం గ్రామాల మధ్య కంకరపోసి వదిలేసిన రోడ్డు

పూర్తికాని కల్వర్టులు

బీమారం- సూర్యాపేట రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన కల్వర్టుల ఆధునికీకరణ ఇప్పటివరకు కూడా పూర్తి కాలేదు. నిర్మాణంలో 9 బాక్స్ కల్వర్టులు ఉండగా, గూనల ద్వారా నిర్మించాల్సిన కల్వర్టులు సుమారు 50కి పైగా ఉన్నాయి. బాక్స్ బ్రిడ్జి నిర్మాణాల్లో ఆరు నిర్మాణం పూర్తికాగా మరో మూడు పెండింగ్‌లో ఉన్నాయి. పూర్తయిన బ్రిడ్జిల వద్ద కూడా మట్టిపోయకపోవడం వల్ల ప్రయాణికులు తాత్కాలిక రోడ్డుపై ప్రయాణించాల్సి వస్తుంది. గూనల నిర్మాణంలో సుమారు 30 నిర్మాణాలు పూర్తికాగా మరో 20 పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతీ ఐదు కిలోమీటర్లకు ఒక చోట రోడ్డు తవ్విన గుంతలు ఏర్పడటంతో ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఈ కల్వర్టులపై ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలు కాగా పలువురు మృత్యువాత పడ్డారు. అయినా వాటిని పూర్తి చేయడంలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమవుతున్నారు.

దశాబ్దకాలమైనా పూర్తికాని పనులు

వేములపల్లి మండలం శెట్టిపాలెం క్రాస్ రోడ్డు నుంచి సూర్యాపేట వరకు రోడ్డు విస్తరణ కోసం 2014లో నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా 2016 జూలై 7న రోడ్డు పనులను నాటి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి మొదటి విడతగా రూ.35కోట్లు మంజూరు కాగా రెండో విడత మరో రూ.14.5కోట్లు మంజూరు చేశారు. ఈ రోడ్డు విస్తరణ పనులను చేపట్టడానికి కేఎంఆర్ (కె.మోహన్‌రెడ్డి) గ్రూప్స్ కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. ఈ పనులను చేపట్టేందుకు సబ్ కాంట్రాక్టర్ బీపీఎస్‌సీ (లక్ష్మయ్య)కు అప్పగించారు. అప్పటి నుంచి కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి కారణంగా విస్తరణ నిర్మాణ పనులు దశాబ్దకాలం కావస్తున్నా ఇప్పటివరకు పూర్తి కాలేదు. పలుమార్లు అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అసంపూర్తిగా తండాల రోడ్లు

గిరిజన సంక్షేమ నిధులతో చేపట్టిన పలు రోడ్డు పనులు కూడా మండలంలో మధ్యలోనే నిలిచిపోయి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని సల్కునూరు, మాడ్గులపల్లి మండలం సీత్యాతండా వరకు రూ.1.90కోట్లతో 2023 జూలై నెలలో పనులు ప్రారంభించగా కంకరపోసి వదిలివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా 2023 అక్టోబరులో మొల్కపట్నం నుంచి ఇసుకబావిగూడెం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం కోసం సీడీపీ నిధులు రూ.75లక్షలతో నిర్మాణ పనులను, వేములపల్లి నుంచి గోగువారిగూడెం వరకు వంతెన, రోడ్డు నిర్మాణం కోసం సీఆర్ఆర్ నిధుల కింద రూ.1 కోటితో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పనులను ప్రారంభించగా నేటి వరకు ఆ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ఆయా గ్రామాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.477 కోట్లు మంజూరు



దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలోని సీసీ, బీటీరోడ్లు, కల్వర్టుల నిర్మాణం, మరమ్మతులకు రూ.477 కోట్లు హ్యామ్ పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమశాఖ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధుల మంజూరుతో దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొన్నేళ్లుగా నెలకొన్న రోడ్లు, కల్వర్టుల నిర్మాణ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. గత పాలకులు సొంత ఆస్తులను కూడబెట్టుకోవడంలో ఉన్న శ్రద్ధ ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ప్రాజెక్టుపై చూపలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ సహాయ, సహకారాలతో డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం, పెండ్లిపాకల ప్రాజెక్టుల ఎత్తు పెంచడానికి కృషి చేస్తున్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల, ఏదుళ్ల రిజర్వాయర్ నిర్మాణానికి రూ.1800 కోట్లు కేటాయించిందన్నారు. ఏఎమ్మార్పీ కాలువల మరమ్మతులకు రూ.350 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. దేవరకొండ పట్టణంలోని పర్వతరావు చెరువు మరమ్మతులకు రూ.1.22 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లు, ప్రాజెక్టుల నిర్మాణం, సాగు, తాగునీరు, విద్య, వైద్యం అందించడమే తన లక్ష్యమని అన్నారు. ప్రజాపాలనలో అభివృద్ధి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, జాన్‌యాదవ్, సర్వయ్య, బిక్కునాయక్, ఎండీ యూనుస్, పాండునాయక్, యాదయ్య, బాలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి అనుగ్రహం పొందాలి

చింతపల్లి: సమాజంలోని ప్రతిఒక్కరూ అయ్యప్పస్వామి అనుగ్రహం పొందాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం చింతపల్లి మండలంలోని గొడకొండ్ల అయ్యప్ప స్వామి దేవాలయంలో దివంగత ఇడుకుళ్ల ఎట్టయ్య గురుస్వామి కుమారుల ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ పూజకు ఎమ్మెల్యే బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయా కార్యక్రమంలో చందర్‌నాయర్ గురుస్వామి, ఇడుకుళ్ల రాంమోహన్, భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, ఎం.యాదగిరి, చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలి



జమ్మనకోటలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎంఈవో కె.శ్రీనివాస్ అన్నారు. నాగార్జునసాగర్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శీతాకాల శిబిరాన్ని గురువారం మండలంలోని జమ్మనకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విధానంతో విద్యార్థుల్లో సామాజిక బాధ్యత కొరవడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వ, పచ్చదనం తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల్లో నెలకొన్న సాంఘీక దురాచారాలను తరిమికొట్టేందుకు, ప్రజల్లో సామాజిక స్పృహను పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.సతీష్‌చంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌గౌడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు చింతపల్లి వెంకటయ్య, ప్రసన్నలక్ష్మి, గోపాలకృష్ణ, సైదమ్మ, రవీందర్, జనార్దన్, మణిదీప్, శంకర్, గోపీనాథ్, మాధురి, మెరీనా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అప్పుల పాలయ్యాం.. ఆదుకోరూ

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. కొన్ని పాఠశాలల్లో పనులను పూర్తి చేసినప్పటికీ ఎస్ఎంసీ చైర్మన్‌లకు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. ఆర్థిక స్తోమతలేని చైర్మన్లు అప్పులు తెచ్చి పనులు చేసినప్పటికీ బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బిల్లులు పెండింగ్ ఇలా..

మన ఊరు, మనబడి పథకంలో చేపట్టిన పనులకు జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్ల బిల్లులు పెండింగ్ ఉండగా, దేవరకొండ నియోజకవర్గంలో రూ.6కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. చందంపేట మండలంలో రూ.43.6లక్షలు, చింతపల్లి మండలంలో రూ.55.2లక్షలు, దేవరకొండ మండలంలో రూ.75.6లక్షలు, గుడిపల్లి మండలంలో రూ.95.63 లక్షలు, డిండి మండలంలో రూ.1.13కోట్లు, కొండమల్లేపల్లిలో రూ.28.98లక్షలు, నేరేడుగొమ్ములో రూ.29లక్షలు, పీఏపల్లిలో రూ.1.13 కోట్లు పాఠశాలల్లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

వడ్డీలు కట్టలేకపోతున్నా

బిల్లులు వస్తాయని అప్పు తెచ్చి మన ఊరు, మనబడి పథకంలో పనులు చేశాను. పనులు పూర్తి చేసినా బిల్లులురాక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నా. చేసిన పనులకు రూ.14లక్షలు రావాల్సి ఉంది.

- ఎలిజాల మాదవయ్య, గోనబోయినపల్లి

26న రాంమూర్తియాదవ్ విగ్రహావిష్కరణ

హాలియా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రాంమూర్తియాదవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని తేదీన త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారులు గుండెబోయిన కోటేష్‌యాదవ్, నగేష్‌యాదవ్ తెలిపారు. గురువారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చలకుర్తి నియోజకవర్గంగా ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి తన తండ్రి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. విగ్రహాన్ని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు లింగయ్యయాదవ్ ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వారివెంట బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

విద్యారంగ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యారంగ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కీర్తి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఎన్నెస్పీ క్యాంపులో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వార్షిక పరీక్షలకు ఎంతో సమయం లేదని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థులకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కుత్బుద్దీన్, దయాకర్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సురక్ష బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



దేవరకొండ మునిసిపాలిటీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ కోరారు. గురువారం దేవరకొండ మునిసిపాలిటీ మహిళ సంఘాలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు వాహనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరానికి రూ.20 చెల్లిస్తే ప్రమాదం జరిగినప్పుడు రూ.2లక్షల వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, శివాజీ, బ్యాంకర్లు జహంగీర్, నిరంజన్, జగమంతు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని నందీశ్వర ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు శివాలయంలో దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకుడు సురభి కృష్ణమూర్తిశర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోతల వేళ ఆశలు ఆవిరి

(5వ పేజీ తరువాయి)

సాగుచేయగా, వరి 5.42 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. పత్తి కాయ పగిలి తీత పనులు సాగుతుండగా వరి కోతదశకు చేరిన సమయంలో కురుస్తున్న వర్షాలకు ఫలితం చేతికి అందకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **మార్కెట్ నిబంధనలకు వాతావరణ ప్రతికూలం**

పంటను మార్కెట్‌లో విక్రయించాలంటే సీసీఐ, ఐకేపీ కేంద్రాల నిబంధనలకు అనుగుణంగా రైతులు సరుకును తీసుకురావాల్సి ఉంటుంది. జిల్లాలో నాగార్జునసాగర్, మునుగోడు, నల్లగొండ ప్రాంతాల్లో పత్తి చేలు ముందు వేయడంతో కాయలు పగిలి ఫస్ట్ పికింగ్ పనులు సాగుతుండగా దేవరకొండ ప్రాంతంలో మరికొద్ది రోజుల్లో పత్తితీత పనులు మొదలయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. రోజు వర్షపు జల్లులు కురుస్తుడటంతో తేమ శాతం అధికంగా ఉంటోంది. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే క్వింటాకు రూ. 8,110 ధర వెచ్చించి పత్తిని కొనుగోలు చేస్తుడటంతో తేమశాతం రైతుకు పాలిటశాపంగా మారుతోంది. నాన్ ఆయకట్టు ప్రాంతంలో బోరు బావుల కింద వరి సాగు చేసిన రైతులు కోతలు ప్రారంభించారు. ఆయట్టులో మరో 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఐకేపీ కేంద్రాల్లో 17 శాతం తేమ ఉంటేనే గ్రేడ్ వన్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,389 చెల్లించనున్నారు. కానీ ధాన్యం ఆరబెట్టుకునే వాతావరణమే లేదని రైతులు వాపోతున్నారు. వర్షాల కారణంగా పూర్తి ప్రతికూల పరిస్థితితులు నెలకొంటున్నాయి. వర్షాలకు తోడు భారీగా చలిగాలులు వీస్తుండటంతో పంట చేలు నీళ్ల పాలవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. దిగుబడి సగానికి తగ్గిపోయి రైతు కుటుంబాలు ఆర్థికంగా ఛిద్రమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని కంటతడి పెడుతున్నారు.

అనుకూలతను బట్టి క్రాప్ కటింగ్ చేయాలి



వర్షాలు కురుస్తున్నందున వరి కోతల సమయంలో రైతు సంయమనం పాటించాలి. కోతకు వచ్చిన వరి చేను గాలివానకు పడిపోతే మొలకలెత్తకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి. కోసిన ధాన్యాన్ని ప్రస్తుతం అందుబాటులో ఉన్న మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టుకునేలా చూడాలి. సాధ్యమైనంత వరకు వాతావరణం పొడిగా ఉన్న సమయంలో హార్వెస్టింగ్ చేయాలి.

- సైదానాయక్, ఇన్‌చార్జి ఏడీఏ

ఏరియా ఆసుపత్రిలో కార్మిక టెండర్లు చేపట్టాలి



ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకుడు సయీద్

మిర్యాలగూడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిలో కార్మిక టెండర్లు సత్వరమే చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సయీద్ కోరారు. టెండర్లు వేతన పెంపు చేపట్టాలని కోరుతూ ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాస సమరద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల కాంట్రాక్టు కాలపరిమితి ముగిసినందున వెంటనే కొత్త టెండర్లు పిలిచి వేతనం రూ.26వేలకు పెంచాలని కోరారు. కాంట్రాక్టరు కాల పరిమితి ముగిసినందున వేతనాల చెల్లింపుతో జాప్యం జరుగుతోందని, తక్షణమే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జానీమియా, పద్మ, శ్రీనయ్య, వెంకటమ్మ, నాగమణి, మహేశ్, అంజయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న అయ్యప్ప స్వాముల పాదయాత్ర

చింతపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):రంగారెడ్డి జిల్లా ఇబ్రహీపట్నం అయ్యప్ప దేవాలయం నుంచి శబరిమలకు ప్రారంభించిన అయ్యప్పస్వాములు పాదయాత్ర గురువారం చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వనగర్‌కు చేరుకుంది. ఈ మేరకు పట్టణంలోని పలువురు భక్తులు ఇరుముడి ధరించి పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప మాలధారులను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అయ్యప్ప మాలధారులు పాదయాత్రలో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నేరేడుగొమ్ములో ఓపెన్ హౌస్

నేరేడుగొమ్ము, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గురువారం నేరేడుగొమ్ము పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఆయుధాల ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా ముందుకు వెళ్లాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఎఫ్ఐఆర్, తదితర వివరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలపై పట్టు సాధించాలని శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు శ్రీకాంత్, స్వాతి, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు తేమ తంటా

(5వ పేజీ తరువాయి)

పింజ పొడవును 27.50 నుంచి 28.50 మి.మీలుగా ప్రామాణికంగా మద్దతు ధరను చెల్లిస్తారు. అదేవిధంగా తేమ శాతాన్ని 8 శాతం నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కొనుగోలు ఆటంకం లేకుండా నిబంధనలు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఈసారి పత్తి కొనుగోళ్లకు ఆటంకం లేకుండా అనేక నిబంధనలతో ముందుకు వచ్చింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు, వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లకు సమయాత్తం అవుతుంది.

కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌తో...

2025-26 సంవత్సరానికి ఎంఎస్పీ కింద సీసీఐ పత్తి విక్రయించడానికి కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను ప్రతీ రైతు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ నెంబర్, ఓటీపీ ద్వారా లాగిన్ చేయాల్సి ఉంటుంది. రైతుల కనీస మద్దతు ధర పథకం కింద రైతుల ప్రయోజనం చేకూర్చడానికి కపాస్ కిసాన్ యాప్‌ను అమలు చేస్తున్నారు. ప్రతీ రైతు స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తిని అమ్ముకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ఈసారి డాటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా కలెక్టరేట్ నుంచే గుర్తించిన వారిని కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. గతంలో కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో సమస్యలతో పాటు రైతులకు ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో కొనుగోళ్ల పారదర్శకంగా ఉండటంతో రైతుల సమస్యలు తొలగించడం కోసం అనేక సంస్కరణలతో కొనుగోలు చేపట్టాలని నిర్ణయించారు. అయితే అడపాదడపా కురిసిన వర్షాలు రైతులకు ఏ మేరకు మద్దతు ధర వస్తుందో లేదా అనే సందేహం మాత్రం సర్వత్రా వ్యక్తమవుతుంది. అధికారుల నిబంధనల మేరకు రైతులు ముందుకు రాకపోతే ఎట్టి పరిస్థితుల్లో పత్తి కొనుగోలు చేయమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.